
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 28 ఏప్రిల్ 2024



యువ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



ఓటేద్దాం.. వేయిద్దాం..

- 3కే వాక్‌లో నినదించిన యువత
- కర్తవ్యంగా భావించి ఓటింగ్‌లో పాల్గొనాలి : ముఖేష్ కుమార్ మీనా

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: ఓటు వేద్దాం.. వేయిద్దాం. ఓటు వేయండి గళం వినిపించండి.. ఓటు విలువ తెలుసుకో.. మంచి నేతను ఎన్నుకో. ఓటు విలువ తెలుసుకో.. తలరాతను మార్చుకో. ప్రలోభాల ఓటు.. ప్రగతికి చేటు.. అంటూ యువత నినదించింది. ఓటరు అవగాహన కోసం లెట్స్ ఓట్ సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా గుంటూరులో 3కే వాక్ నిర్వహించింది. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న యువత పెద్దసంఖ్యలో ఈ 3కే వాక్‌లో ఉత్సాహంగా పాల్గొంది. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి 3 కే వాక్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ నడక మదర్ థెరిస్సా విగ్రహం, కొరిటెపాడు, ఐటీసీ హోటల్ మీదగా తిరిగి ఎన్టీఆర్ స్టేడియం వరకు సాగింది. అంతకుమందు ఓటు వినియోగంపై యువత చేత రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేయడానికి మే 13న యువ ఓటర్లు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా మిగిలిన వారితో కూడా ఓటు వేయించేలా కృషి చేయాలని యువతకు సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న లెట్స్ ఓట్ సంస్థ నిర్వాహకులను అభినందించారు.



మొదటి సారి ఓటు వినియోగించుకునే విద్యార్థినులు

ఓటింగ్‌పై అవగాహన..

రాష్ట్రంలో పోలింగ్ నమోదు శాతం గణనీయంగా పెంచేందుకు జిల్లాల వారీగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. మధ్య తరగతి, ఉన్నత మధ్య తరగతి వర్గాలకు చెం దిన వారు ఓటు హక్కు వినియోగించుకునేలా వారు నివసిస్తున్న ప్రాంతాల్లోని వెల్ఫేర్ అసోసియేషన్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైజాగ్, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి నగరాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన యువతి, యువకులు 43,500 మందిని ఓటర్లుగా నమోదు చేశామన్నారు. వీరందరూ ఓటు వేయడంతో పాటు వారి కుటుంబసభ్యులు, స్నేహితులు కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద లైన్లలో నిల్చోవాలన్న కొద్దిపాటి నిర్లప్తత వల్ల ఓటు విని యోగంలో ఆసక్తి చూపడం లేదన్నారు. వారం దరిలో ఓటుపై అవగాహన కల్పించి, ఓటింగ్‌లో పాల్గొనేలా యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. జేసీ రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే రాజ్యలక్ష్మి, ఆర్డీవో శ్రీకర్, లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ ప్రొఫెసర్ కే మాలకొండయ్య, కో ఆర్డినేటర్ బాలాజీతో తదితరులు పాల్గొన్నారు.



3కే వాక్‌లో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకునే విద్యార్థులు

దళితులంటే జగన్‌కు చిన్నచూపు

- సంక్షేమ పథకాలను రద్దు చేసి ద్రోహం
- ముస్లింలపై పెరిగిన వేధింపులు, దాడులు
- రచ్చబండ కార్యక్రమాల్లో నారా లోకేశ్



మంగళగిరి షరాఫ్‌బజార్ రచ్చ బండలో మాట్లాడుతున్న లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 27: ముఖ్యమంత్రి జగన్‌కు దళితులంటే చిన్నచూపు. దళితుల సంక్షేమానికి సంబంధించిన టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలను రద్దు చేశారు. దళితులకు సీఎం జగన్ తీరని ద్రోహం చేశారు.రాష్ట్ర చరిత్రలో గత ఐదేళ్లలో దళితులకు జరిగినంత అన్యాయం మరెప్పుడూ జరగలేదు.. అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నారా లోకేశ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి ఆయన పెదవడ్లపూడి, మంగళగిరి షరాఫ్ బజారు, ఇందిరానగర్‌లలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ కార్పొరేషన్‌ను జగన్ పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఐదేళ్లలో కార్పొరేషన్ ద్వారా ఏఒక్కరికైనా స్వయం ఉపాధి రుణాలను ఇప్పించారా అని నిలదీశారు. వైసీపీ హయాంలో దళితుల సంక్షేమం పూర్తిగా ఎండమావిగా మారిం దని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల సంక్షేమంపై వైసీపీ నాయకులకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ముస్లీంలు, దళితులపై వేధింపులు, దాడులు పెరిగాయన్నారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు కిరాతకంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన సంగతి రాష్ట్ర ప్రజలందరికీ గుర్తుండే ఉంటుందన్నారు. అటువంటి వ్యక్తిని జగన్ తన పక్కన కూర్చోబెట్టుకోవడం దేనికి సంతకేతమని ప్రశ్నించారు. కుసు కూడ జగన్ ప్రభుత్వం వేధింపులకు గురి చేసిందన్నారు. గతంలో తాము రంజాన్ తోఫా, మసీదులకు నిధులు, ఇమామ్, మౌజామ్‌లకు గౌరవ వేతనాలు అందిస్తే జగన్ వాటిని రద్దుచేశారన్నారు. జగన్ ప్రభుత్వ వేధింపులు తట్టుకోలేక నంద్యాలలో అబ్దుల్ సలామ్ కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. పలమనేరులో మిస్బా ఆత్మహత్య చేసుకుందన్నారు. వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం పోరాడిన నేరానికిగాను ఇబ్రహీంను నరసరావుపేటలో నరికి చంపారన్నారు. సీఏఏ గురించి టీడీపీపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు పార్లమెంటులో ఆ బిల్లుకు అనుకూలంగా గంపగుత్తగా ఎందుకు ఓట్లేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెదవడ్లపూడిలో దళితులకు కమ్యూనిటీ హాలును నిర్మిస్తామన్నారు. భూమిని కొనుగోలు చేసి శ్మశానానికి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. భూగర్భ డ్రెయినేజీలను నిర్మించి దోమల బెడద లేకుండా చర్యలు చేపడతామన్నారు. పొలాల మధ్య డొంకరోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.



చర్చిలో ఫాదర్ల ఆశీర్వాదం

స్వర్ణకార భవన్, కార్పొరేషన్ ఏర్పాటు

స్వర్ణకారులను ఆదుకునేందుకు రాష్ట్రంలో వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌తోపాటు మంగళగిరిలో స్వర్ణకార భవన్‌ను ఏర్పాటుచేస్తామని లోకేశ్ షరాఫ్‌బజార్‌లో జరిగిన రచ్చబండలో హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో టీడీపీకి ఓటేశారనే నెపంతో స్వర్ణకారులపై పోలీసులు వేధింపులు అధికమయ్యాయన్నారు. నీతి, నిజాయితీతో వ్యాపారాలు చేసే స్వర్ణకారులపై ప్రభుత్వం వేధింపులకు పాల్పడడం దారుణమన్నారు. స్వర్ణకారులకు గుర్తింపుకార్డులను ఇప్పించి వారికి రక్షణ కల్పిస్తామన్నారు. మంగళగిరిలో గోల్డ్ సెజ్‌ను ఏర్పాటు చేయించి ల్యాబ్ డైమండ్, ఆధునిక ఆభరణాల తయారీపై శిక్షణను ఇప్పిస్తామన్నారు. దక్షిణభారతదేశంలోనే మంగళగిరిని అతిపెద్ద గోల్డ్‌హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆ ప్యోను ప్రక్షాళన చేస్తామన్నారు వడ్లపూడివాసులకు కృష్ణా జలాలను అందిస్తామన్నారు.

అందరితో శభాష్ అనిపించుకుంటా..


ఎన్నికల కోసం మాటలు చెప్పడం కాదు.. చెప్పినవన్నీ గుర్తుంచుకుంటా.. ప్రతీ పనిని, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి మీ అందరిచేత శెబాష్ అనిపించుకుంటానని మంగళగిరి ఇందిరానగర్‌వాసులకు మంగళగిరి ఇందిరానగర్‌లో తెలిపారు. నియోజకవర్గమంతటా పర్యటించి తెలుసుకున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తానన్నారు. పనిచేయాలనే తపన, పట్టుదలతోనే తాను మంగళగిరికి వచ్చానన్నారు. పేదరికం లేని మంగళగిరిని తయారు చేయడమే తన ముందున్న కర్తవ్యమన్నారు.

- మహిళలతో కరచాలనం



కార్మిక.. సంక్షామం!

రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం చూడాల్సిన కార్మిక శాఖ కార్మికులకు కనీసమాత్రంగా కూడా భరోసా ఇవ్వలేకపోతోంది. పని ప్రదేశంలో, నిత్య జీవితంలో కార్మికులు ఎదుర్కొనే చిన్న సమస్యలు కూడా పరిష్కరించలేని దీనావస్థకు చేరింది. కార్మికుల న్యాయమైన కోర్కెలు, డిమాండ్లను కూడా పరిష్కరించలేనంతగా కార్మికశాఖ నిర్వీర్యమై పోయింది. ఇదంతా ఒక ఎత్తైతే కార్మికులు దాచుకున్న కష్టార్జితాన్ని కూడా దారి మళ్లించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోంది. దీంతో కార్మికులు ఆ శాఖపై విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.



- కనీస మాత్రంగా భరోసా ఇవ్వని కార్మిక శాఖ
- తీవ్ర ఇబ్బందుల్లో నిర్మాణరంగ కార్మికులు
- కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.15 కోట్ల విలువ చేసే క్లైములు పెండింగ్
- అయినప్పటికీ ప్రీమియం వసూళ్లు చేస్తున్న అధికారులు
- కరోనా సాయానికి మొండిచేయిచ్చి వంచించిన జగన్



గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. గత నాలుగేళ్లగా పనులు లేక, బతుకుదెరువు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమల్లోకి తెచ్చిన నూతన ఇసుక విధానం వీరి పొట్ట గొట్టింది. ఫలితంగా ఇసుక కొరత, ఆకాశాన్నంటిన ఇసుక ధరలతో నిర్మాణాల వేగం తగ్గింది. దీంతో చాలామంది పనికోల్పోయారు. 2019 డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల అంశాన్ని తెరమీదకు తేవడంతో జిల్లావ్యాప్తంగా నిర్మాణాలు ఎక్కడివి అక్కడే ఆగిపోయాయి. ఫలితంగా లక్షలాదిమంది పనులు కోల్పోయారు. ఆ వెంటనే వచ్చిన కరోనా కార్మికులను కోలుకోలేనంతగా దెబ్బతీసింది. మూడు దశల్లో వచ్చిన కరోనా కారణంగా కార్మికులు 2022 వరకూ పనులు కోల్పోయారు. సమాజమంతా కరోనా కష్టాల నుంచి బయట పడినప్పటికీ నిర్మాణ కార్మికులను వీడలేదు. నిర్మాణాలకు అవసరమయ్యే ఇనుము, సిమెంటు, ఇసుక, కలప, రంగుల ధరలు ఆకాశాన్నంటడంతో జిల్లాలో ఎవరూ కొత్త నిర్మాణాల జోలికి పోలేదు. దీంతో గడిచిన మూడున్నరేళ్లుగా కార్మికులు తీవ్ర ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

పథకాన్ని నీరుగార్చిన జగన్‌రెడ్డి

నిర్మాణరంగ కార్మికుల ఒత్తిడితో 2007 వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏ ర్పాటు చేసింది. ఈ బోర్డు ద్వారా కార్మికుల దినసరి కూలీ ల్లోంచి కొంత మొత్తం తీసుకుని సంక్షేమ బోర్డులో జమ చేస్తారు. గుంటూరు జిల్లాలో ఉన్న 6 లక్షల మంది కార్మికులు దాదాపు రూ.90 కోట్లు ఈ బోర్డులో తమ కష్టార్జితాన్ని జమ చేశారు. కాగా రాజశేఖర్‌రెడ్డి కుమారుడైన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసింది. పదిహేనేళ్లుగా కార్మికులు తమ కష్టార్జితం నుంచి జమ చేసిన రూ.830 కోట్లను దారి మళ్లించింది. ఫలితంగా సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందవలసిన సంక్షేమ కార్యక్రమాలన్నీ పూర్తిగాఆగి పోయాయి.

నాలుగేళ్లుగా క్లెయిమ్‌ల పెండింగ్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన మూడున్నరేళ్లగా కార్మికుల సంక్షేమానికి సంబంధించిన క్లైములు పెండింగులో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు పరిష్కరించి కార్మికులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ఎప్పటికప్పుడు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం వాటిని పరిష్కరించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో 9 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి తాలూకు కార్మికులకు రూ.15 కోట్ల పరిహారం అందాల్సి ఉంది. కానీ ఒక్కరికి కూడా పరిహారం అందలేదు. కాగా ప్రతి ఏటా కార్మికుల నుంచి రూ.12 చొప్పున అధికారులు ప్రీమియంను వసూలు చేయడం విశేషం.



కరోనా సాయానికి టోకరా

కరోనా కష్టకాలంలో తీవ్రంగా నష్టపోయిన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్న డిమాండ్ పెద్దఎత్తున వచ్చింది. ఒత్తిడి తీవ్రం కావడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కరోనా సాయం అందించాల ని కేంద్రం సూచించింది. ఆ మేరకు కేరళ, ఢిల్లీ సహా పలు రాష్ట్రాలు కార్మికులకు రూ.5 వేల చొప్పున పరిహారం అందించాయి. రాష్ట్రంలో కూడా కార్మికులు తమ సంక్షేమ నిధి నుంచి సాయం చేయాలని కోరారు. అయిన ప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కార్మికులకు కరోనా సాయం చేయలేదు.

ప్రశాంతంగా పాలిసెట్

88.84 శాతం విద్యార్థులు హాజరు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 27: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం శనివారం సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. గుంటూరు, తెనాలి కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 88.84 శాతం విద్యార్థులు హాజరయ్యారు. గుంటూరులో ఏర్పాటు చేసిన 11 కేంద్రాల్లో 4632 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 3908 మంది (84.37 శాతం) మంది హాజరయ్యారు తెనాలి డివిజన్‌లో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో 795 మందికి 687 మంది(88.84 శాతం) హాజరయ్యారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు పాలిసెట్ కోఆర్డినేటర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ తెలిపారు.



కేంద్రాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఒక్క ఛాన్స్‌తో అందరిని ముంచాడు

- 1594 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

టీడీపీలోకి మాజీ ఎమ్మెల్యే చీరాల

- నేడు చంద్రబాబు సమక్షంలో చేరిక

6లో..

జిల్లా ఓటర్లు 17,91,543

8లో..

- తుది ఓటర్ల జాబితా విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయలు, పక్కన బ్రహ్మారెడ్డి

పాస్టర్లకు గౌరవ వేతనం ఇస్తాం

● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 27: అర్హులైన పాస్టర్లందరికీ గౌరవ వేతనం అందిస్తామని ఎన్డీఏ కూటమి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. శనివారం పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించిన పాస్టర్ల ఆత్మీయసమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు అనేక సమస్యలతో, ఇబ్బందులతో పాస్టర్ల వద్దకు వస్తారని, ఆసమయంలో వారికి మనోధైర్యం కల్పించి సన్మార్గంలో నడిపేందుకు పాస్టర్లు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. పాస్టర్లలో అర్హులైనవారికి నివాస స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కూటమి అధికా రంలోకి రాగానే రాష్ట్రంలో పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రార్థనా మందిరాల ఆధునికీకరణకు, సమాధి తోటల ప్రహరీ, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య దర్శి పంగులూరి అంజయ్య, కొమెర దుర్గారావు, యెనుమల కేశవరెడ్డి, సీనియర్ నేత మల్లికార్జునరావు, పుల్లారావు, పాస్టర్లు ఆనందరావు, చంద్రపాల్, ఐజాక్, చంద్రయ్య, పాల్గొన్నారు.

టీడీపీలోకి మాజీ ఎమ్మెల్యే చీరాల

● నేడు చంద్రబాబు సమక్షంలో చేరిక



మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి

బాపట్ల, ఏప్రిల్ 27 : మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు చీరాల గోవర్ధనరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. శనివారం రెడ్డి సామాజిక వర్గ గ్రామాలలో తన అనుచరులతో కలిసి గోవర్ధనరెడ్డి పర్యటించారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యే కోన రఘుపతి పోకడలతో రెడ్డి సామాజికవర్గం అనేక ఇబ్బందులు పడిందని వివరించారు. ఇప్పటికే 75 శాతం రెడ్డి వర్గీయులు తెలుగుదేశంపార్టీకి అనుకూలంగా ఉన్నారని చెప్పారు. అందుకే ప్రతి గ్రామం నుంచి ప్రజలు తరలివచ్చి తెలుగుదేశం పార్టీకి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తు న్నారు ఆదివారం నెల్లూరులో జరిగే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభలో తాను టీడీపీలో చేరుతున్నట్లు చీరాల గోవర్ధనరెడ్డి తెలిపారు. ఆయనతో పాటు సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, మాజీ కౌన్సిలర్ భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, బేతపూడి గ్రామానికి చెందిన మాజీ నాయకులంతా టీడీపీలో చేరనున్నారు. ఇందుకుగాను ముందుగానే నియోజక వర్గ పరిధిలోని గ్రామాల ప్రజలకు, తన అనుచరవర్గానికి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

గిరిజన సంక్షేమానికి కృషి

● ఏడాదిలో వరికపూడిశెల పూర్తిచేస్తాం
● మాచర్లకు వంద పడకల ఆసుపత్రి తీసుకొస్తాం
● నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు




సమావేశంలో మాట్లాడుతున్న లావు శ్రీకృష్ణ దేవరాయలు, బ్రహ్మారెడ్డి, అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 27: కూటమి అధికారంలోకి రాగానే గిరిజన సంక్షేమానికి కృషి చేస్తామని కూటమి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణ శివారులోని కొత్తపల్లి జంక్షన్లో శనివారం జరిగిన గిరిజనుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్టీలకు నిలిచిపోయిన 16 పథకాలను అమలు చేస్తామన్నారు. ఇక్కడి ప్రజలు అధికంగా తాగునీటి సమస్యను నాదృష్టికి తెచ్చారన్నారు. జలజీవన్‌మిషన్ కింద మాచర్ల నియోజకవర్గంకు సంబంధించి ఇంటింటికి కుళాయి కింద రూ.50 కోట్లు తెచ్చుకోగలిగామన్నారు. డబ్బులున్నా పనిచేసే కాంట్రాక్ట్ ముందుకు రావడం లేదన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ కోసం 60 ఏళ్ల చాలామంది పోరాటం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు కోసం ఒక్కరూ ప్రయత్నం చేయకుండా శంకుస్థాపనలతో కాలయాపన చేశారన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణానికి వెల్డ్‌లైఫ్, కేంద్రం నుంచి అన్ని అనుమతులు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు కేటాయించడమే మిగిలిందన్నారు. ప్రాజెక్ట్ పూర్తి చేయడం కష్టమైంది కాదనేది తన బావన అన్నారు. రానున్న యేడాదిలో ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కేంద్రీయ విద్యాలయంను ఇక్కడ ఏర్పాటు చేసేలా అనుమతులు తీసుకొచ్చానన్నారు. మాచర్ల - నడికుడి, మాచర్ల - శ్రీశైలం కేంద్ర రహదారులు మార్పు కోగలిగామన్నారు. పూర్తిస్థాయిలో కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామన్నారు. పిడుగురాళ్లలో మెడికల్ కళాశాల స్థాపించుకోగలిగామన్నారు. మాచర్లలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్యే పీఆర్కే, గిరిజన ద్రోహి: బ్రహ్మారెడ్డి

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గిరిజన ద్రోహి అని కూటమి మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ వద్ద 200 ఎకరాల భూములను బెదిరించి స్వాధీనం చేసుకున్నారన్నారు. మాటలు చక్కగా చెబుతాడు.. అబద్ధాన్ని నిజంలా నమ్మిస్తారు.. ఎవరి భుజం చేయి వస్తే అతని పని అయిపోయినట్లే.. అని వ్యంగంగా అన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే బడుగు, బలహీనులకు రాజ్యాధికారం దక్కిందన్నారు.చంద్రబాబునాయుడు 200 ఇంజనీరింగ్ కళాశాలలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. టీడీపీ అంటే అభివృద్ధి.. వైసీపీ అంటే అరా చకం.. అరాచకం ఉన్న చోట అభివృద్ధి ఉండదని జగన్ స్పష్టం చేశారన్నారు. కంపెనీలు పారిపోతున్నాయన్నారు. గిరిజనుల కోసం ఆది నుంచి నిలబడింది టీడీపీనే అన్నారు.

ఓటమి భయంలో పిన్నెల్లి సోదరులు

మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డిని ప్రకటించిన రోజునే పీఆర్కే ఓటమి ఖరారైందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ అన్నారు. బ్రహ్మారెడ్డికి నియోజకవర్గంలో పెరుగుతున్న ఆదరణతో పిన్నెల్లి సోదరులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. గిరిజనుల ఆస్తులు కాజేసిన వారు టీడీపీ అధికారంలోకి వస్తే ఎటు పారిపోతారో అంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో గిరిజనులపై దాడులు పెరిగిపోయాయన్నారు. గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. ఇప్పటికీ పిచ్చయ్యబావి తండాకు రోడ్డు సదుపాయం లేదన్నారు. నాగార్జున సాగర్ సమీపంలో ఉన్న గిరిజన తండాలకు తాగునీరు లేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయన్నారు.

కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి మొగిలి కల్లయ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రమావత్ బాలాజీ నాయక్, పార్లమెంట్ అధ్యక్షుడు వి కోటానాయక్, రావెళ్ల కొండలు, వజ్రం నాయక్, రాంసింగ్, పాండు నాయక్, బాణావత్ వెంకటేశ్వర్లునాయక్, సీతానాయక్, గూండ్లా నాయక్, శ్రీను నాయక్, రెడ్యానాయక్, కళ్లెం రామాంజిరెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, కుర్రి శివారెడ్డి, వీరాస్వామి, దుర్గారావు, కంభంపాటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గల్లా మాధవి ఆధ్వర్యంలో భారీగా చేరికలు

● పార్టీలోకి ఆహ్వానించిన లోకేశ్



టీడీపీలో చేరినవారితో నారా లోకేశ్, గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చేరికల పరంపర కొనసాగుతూ వుంది. తాజాగా శనివారం పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి ఆధ్వర్యంలో, యువనేత నారా లోకేశ్ సమక్షంలో భారీగా చేరికలు జరిగాయి. ఉండవల్లిలోని ఆయన నివాసంలో వారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పార్టీలోకి కొత్తగా వస్తున్న నేతలు రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషిచేయాలని, వారందరికీ అధికారంలోకి వచ్చాక తగిన గుర్తింపునిస్తామని తెలిపారు. పార్టీలో చేరినవారిలో 19వ డివిజన్ కార్పొరేటర్ తేలుకుట్ల హనుమా యమ్మ, 23వ డివిజన్ కార్పొరేటర్ సాదు ఉమామహేశ్వరి, వైసీపీ మైనారిటీ విభాగం జిల్లా నాయకులు ఎస్కే మహబూబ్ బాషా, ఎస్కే బాషా, తుమ్మల నాగేశ్వరావు, సాదు రాజేష్, తేలుకుట్ల యోగేశ్వరరావు, సమీర్ బాషా, అరవింద్, ఫిరోజ్ (బడు), శ్రీరాములు, మణికంఠారెడ్డి, సిరా నాగతేజ, అజీజ్, ఒంగోలు శ్రీను, మహమ్మద్ దాదా కరీమ్, వెంకటేశ్వర్లు, తుమ్మల నాగేశ్వరరావు, షేక్ సుభాని, సుబ్బారెడ్డి, షేక్ రసూల్, అడకా వెంకట్రావు తదితరులు ఉన్నారు.

జగన్ పాలనలో యువత భవిష్యత్ అంధకారం

● చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 27: రాష్ట్రంలో మరోసారి జగన్‌రెడ్డివస్తే యువత భవిష్యత్ అంధకారం అవుతుందని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విద్యార్థులు,యువత నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల మోసానికి యువత బలైపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఎన్నికల్లో యువత కూటమి వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. దేశ, విదేశాల్లో ఉన్న యువత మొత్తం చంద్రబాబు చూపించిన భవిష్యత్‌కు గాను కృతజ్ఞతలు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రత్యేకంగా ముస్లిం మైనార్టీల్లో గందరగోళం సృష్టిస్తున్నారని, దానిని ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. మైనార్టీలు ఒక్కరు కూడా వైసీపీకి ఓటు వేయకూడదన్నారు. తమ ప్రభుత్వం రాగానే యువ పారిశ్రామిక వేత్తలకు పది లక్షల ఆర్థిక సాయం, ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ 3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. శాసన సభకు తనను, పార్లమెంట్‌కు లావు శ్రీ కృష్ణ దేవరాయలను సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, బీజేపీ కన్వీనర్ జయ రామిరెడ్డి, ప్రత్తిపాటి శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రూపాయి అవినీతి లేకుండా అభివృద్ధి చేస్తాం

● గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని



పార్టీలో చేరినవారితో పెమ్మసాని, నసీర్

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఒక్క రూపాయి అవినీతి లేకుండా గుంటూరును అభివృద్ధి చేస్తామని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 6, 57 డివిజన్లకు చెందిన సుమారు 350 మంది వైసీపీ కార్యకర్తలు శనివారం టీడీపీలో చేరారు. వారికి పెమ్మసాని చంద్రశేఖర్ పసుపు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గుంటూరు పేరును దేశం మొత్తం వినపడేలా చేస్తానన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండి రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయిన వైసీపీ ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. రాష్ట్ర చరిత్రలో చెట్లు నరికిన నాయకుడు ఎవరైనా ఉంటే అది జగనేనని అన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక రెండు సెంట్లలో ఇళ్ల నిర్మాణం లేదా టిడ్కో ఇళ్ల అందజేత ద్వారా పేదలకు నివాస సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. నిరుద్యోగ సమస్యను తరిమికొట్టే విధంగా పరిశ్రమలు తెస్తామని, ఇంటి నుంచి బయటకు రాలేని మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గుంటూరు తూర్పు అసెంబ్లీ అభ్యర్థి మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ వైసీపీకి ఐదేళ్ళుగా క్రియాశీలకంగా పనిచేసిన నాయకులు కూడా ఆ ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తున్నారని, అందువల్లే టీడీపీలో చేరుతున్నారని వివరించారు. స్థానిక ప్రజలకు రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. టీడీపీ నాయకులు భరత్ రెడ్డి, కార్పొరేటర్ పోతురాజు సమత ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నంబూరు సుభాని, రావి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నందివెలుగులో ప్రసంగిస్తున్న అంబటి తిరుపతి రాయుడు

మంత్రులను కూడా దగ్గరకు రానివ్వడు

● ఇక ప్రజలకు ఏం చేస్తాడు .. మాజీ క్రికెటర్ తిరుపతిరాయుడు

తెనాలి రూరల్, ఏప్రిల్ 27: రాష్ట్ర ప్రజల పరిస్థితులు తెలిపేందుకు వచ్చే మంత్రులను కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దగ్గరకు రానివ్వడు.. ప్రతిపక్షాలపై మాత్రం విరుచుకుపడతాడు.. రైతులు పంటలు దెబ్బతిని ప్రభుత్వ పరామర్శకు చూస్తుంటే కనీసం పట్టించుకోడు.. ఇలాంటి సీఎం ప్రజల కష్టాలు ఏం తీర్చుతాడంటూ మాజీ క్రికెటర్, జనసేన నాయకుడు అంబటి తిరుపతి రాయుడు విమర్శించారు. జనసేన తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా అంబటి తిరుపతిరాయుడు శనివారం తెనాలి మండలం నందివెలుగులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పవర్ కోసం రాజకీయాల్లోకి రాలేదని ప్రజలకోసం.. వారికి మంచి జరగాలన్న పట్టుదలతో రాజకీయాల్లో వచ్చారన్నారు. జగన్ ప్రభుత్వం తిరిగి అధికారం చేపడితే రాష్ట్రం అధోగతిపాలై ప్రజలు అన్ని విధాలుగా నష్టపోక తప్పదన్నారు. విజనరీ కలిగిన నాయకుడు చంద్రబాబునాయుడు, ప్రజల కోసం పనిచేసే పవన్‌కల్యాణ్, దేశం కోసం పాటుబడే నరేంద్రమోడీలను ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. తొలుత ఆయన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ముఖ్యమంత్రి జగన్ కాపు ద్రోహి

●జనసేన ఉమ్మడి గుంటూరుజిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

దుర్గి, ఏప్రిల్ 27: కాపు ద్రోహి జగన్ అని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన దుర్గిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ మేనిఫెస్టో విడుదల చేసిన జగన్ గతంలో ఎన్నికల హామీలు 99 శాతం చేశానని ప్రగల్భాలు పలుకుతున్నారని, కనీసం ఒక్క శాతం కూడా చేయలేదన్నారు. కావాలనే ఓడిపోయే సీట్లలో కాపులను అభ్యర్థులుగా ప్రకటించారన్నారు. జనసేన అధినేత పవన్‌ను ఓడించడమే ధ్యేయంగా వేలకోట్లు డబ్బు, మద్యం ఏరులై పారుతుందన్నారు. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ లక్ష మెజార్టీ రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నక్షత్రపు ప్రసాద్, బూసా రామాంజినేయులు, పులి హరి, రుద్రాల రవి, కొప్పుల వెంకటరమణ, బీమా అమరయ్య, నూరె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హౌస్ ట్యాక్స్ డిమాండ్ ఇవ్వొద్దు

● సచివాలయ ఉద్యోగులకు అధికార పార్టీనేత హుకుం జారీ ?

పిడుగురాళ్ల, ఏప్రిల్ 27: పట్టణంలోని గృహ యజమానులు, వ్యాపారస్తులు ప్రతి ఏడాది మార్చితో ఆర్థిక సంవత్సరం పూర్తయిన తరువాత కొత్త పన్ను విధానం అమలులోకి వస్తుంది. మార్చి వరకు వున్న ఇంటిపన్నుతో కలిపి 15 శాతం పెంపుతో కొత్త డిమాండ్ నోటీసులు గృహయజమానులకు, వ్యాపార సముదాయాలకు ఇచ్చి ఏడాది ముందుగా టాక్స్ కట్టినట్లైతే 5 శాతం రిబేట్ ప్రభుత్వం కల్పిస్తుందంటూ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల పెంపు, విద్యుత్ చార్జీల పెంపు, ప్రభుత్వంపై వున్న వ్యతిరే కత వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది. దీంతో ఏప్రిల్ నెలలో ఇంటి యజమా నులకు ఇచ్చే టాక్స్, డిమాండ్ నోటీసులను పంపిణీ చేయవద్దని, అలా చేస్తే 15 శాతం పెంపుతో వ్యతిరేకత పెరుగుతుందంటూ అధికార పార్టీ నేతలు సచివా లయ ఉద్యోగులతో ట్యాక్స్ డిమాండ్ నోటీసులను ఇంటింటికి పంపిణీ చేయొద్దని చెబుతున్నారు. పట్టణంలోని సుమారు 15 వేలకు పైగా గృహాలకు ఈ నెలలో ఇవ్వాల్సిన డిమాండ్ నోటీసులను సచివాలయ ఉద్యోగులు పక్కన పడేయడంపై గృహయజమానులు మండిపడుతున్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న అన్నా నందకిషోర్ తదితరులు

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో

శ్రీమేధ విద్యార్థికి ప్రథమ ర్యాంకు

గుంటూరు(విద్య),ఏప్రిల్ 26: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధా విద్యార్థి జాతీయస్థాయిలో ర్యాంకు వచ్చినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థి అన్నా సాయి వెంకట ,దీరజ్ జాతీయస్థాయిలో 340 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ విద్యార్థికి సుల్తాన్ చాంద్ మెమోరియల్ బుక్ ప్రైజ్‌తో పాటు ర్యాంకు సర్టిఫికెట్‌ను ఐసీఏఐ ఆధ్వర్యంలో మే 23న జరిగే కాన్వకేషన్‌లో అందుకోనున్నట్లు తెలిపారు. తమ సంస్థ అందించే ఇంటర్ ఎంఈసీ కాయిన్ ప్రొగ్రామ్ ద్వారా ఏక కాలంలో సీఏ, సీఎంఏ ఫౌండేషన్‌కోచింగ్ పొందిన ఈవిద్యార్థి ఇంటర్‌లో 979 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్‌శ్రీలక్ష్మీ తదితరులు అభినందించారు.

ఒక్క ఛాన్స్‌తో అందరిని ముంచాడు

● 1594 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఏప్రిల్ 27: ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి అన్నివర్గాల ప్రజలను సీఎం జగన్‌రెడ్డి ముంచేశాడని రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్లవద్ద చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1594వ రోజుకుచేరుకున్నాయి ఈ సందర్భంగా రైతు పలువురు రైతులు వారు మట్లాడుతూ.. అమరావతిని విస్మరించి మూడు రాజధానులని రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన జగన్‌కు రెండో ఛాన్స్ లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొసాగాయి.



వెంకటపాలెం ధర్నాశిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

పెదకూరపాడు, ఏప్రిల్ 27: ఆట లాడుకొనేందుకు వెళ్ళి ప్రమాదవశాత్తు బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన ఘటన మండలంలోని కన్నెగండ్ల గ్రామంలో శనివారం జరిగింది. పెదకూరపాడుకు చెందిన పమిడిపల్లి చిన వెంకటేశ్వర్లు, నరసమ్మ దంపతుల ప్రథమ కుమారుడు వేణుగోపాల్(13) వారి అమ్మమ్మ గ్రామమైన కన్నెగండ్లలో మేనమామ బత్తుల ప్రకాష్ ఇంటి వద్ద తల్లి నరసమ్మతో ఉంటున్నారు. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన బొల్లెద్దుల క్రీస్తుబాబు,జమీమ దంపతుల ఇద్దరు కుమారులు ధనుస్సు,ప్రశాంత్ వేసవి సెలవులని మేనమామ ఇంటికి వచ్చారు. ఇంటికి సమీపంలో పంట నీటికోసం తీసిన నీటిబావిలో ప్రమాదవశాత్తు ఆముగ్గురు పడ్డారు. సమీపంలో పొక్లెయినర్‌తో పనిచేస్తున్న షేక్‌బాషాకు గేదెల కాపరులు చెప్పటంతో బావిలోకి దూకి ప్రశాంత్‌ను బయటకు తీసుకు వచ్చారు. ఈ సంఘటనలో వేణుగోపాల్, ధనస్సులు మృతి చెందారు. ధనస్సు మృతదేహాన్ని సత్తెనపల్లి మండలంలోని అబ్బూరికి తీసుకువెళ్ళగా వేణుగోపాల్ మృతదేహాన్ని పెదకూరపాడుకు తీసుకు వచ్చారు. చిన్నారులు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



అధికారులతో మాట్లాడుతున్న పశ్చిమ రిటర్నింగ్ అధికారి కే రాజ్యలక్ష్మి

ఎన్నికల సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేయాలి

● పశ్చిమ నియోజకవర్గ ఆర్వో రాజ్యలక్ష్మి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 27 : ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ (ఆర్ఓ)అధికారి కె.రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం పశ్చిమ నియోజకవర్గంలోని ఈవీఎం కమిషనింగ్ టీం, రిసెప్షన్ టీం, డిస్ట్రిబ్యూషన్ టీంలతో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధులు అత్యంత కీలకమని, విధులు కేటాయించబడిన వారంతా సమన్వయంతో విధులు నిర్వహిస్తే ఎన్నికలు సజావుగా జరుగుతాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎన్నికల నిబంధనల మేరకు కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 291 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్‌కు 32 టేబుల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, అవసరమైన సిబ్బందిని కేటాయించటం జరిగిందని తెలిపారు. ఈవీఎల కమిషనింగ్‌కు కేటాయించిన సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా కమిషనింగ్ ఉంటుందని, టెక్నికల్ టీంతో సమన్వయం చేసుకుంటూ ఉండాల న్నారు. రిసెప్షన్ టీం నిర్దేశిత సమయానికి విధులకు హాజరవ్వాలని, నిర్వహించవలసిన విధులలో ఎటువంటి సందేహా లు, సమస్యలు ఉన్నా తమను సంప్రదించాలని, సదరు సమస్యలను పరిష్కరిం చటం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏఆర్ఓలు సీహెచ్ శ్రీనివాసరావు, శీనారెడ్డి, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, సెక్టార్ అధికారులు, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అస్పష్టంగా ఏపీ జీఎల్ఐ సమాచారం

● యూటీఎఫ్ సదస్సులో నాయకుల ఆందోళన

గుంటూరు (విద్య), ఏప్రిల్ 27: ఏపీ జీఎల్ఐ సమాచారం ఆన్‌లైన్‌లో అస్పష్టంగా ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కళాధర్ ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. కళాధర్ మాట్లాడుతూ ఖాతాదారుల సమాచారం స్పష్టంగా లేదని, సవరించుకునే విధానం తెలియదని టీచర్లు పెద్ద ఎత్తున ఆందోళనపడుతున్న నేపథ్యంలో సదస్సు ఏర్పాటు చేయడమైనదని అన్నారు. ఏపీజీఎల్ఐ జిల్లా కార్యాలయ ప్రతినిధి పోతురాజు ఆన్‌లైన్ విధానంలో వివిధ రకాల దరఖాస్తులు ఏ విధంగా అప్లై చేయాలో వివరించారు. టీచర్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పి సందేహాలు నివృత్తి చేశారు. ప్రతి ఉద్యోగి తమ ఖాతాలను పరిశీలన చేసుకొని ఏవైనా లోపాలు ఉంటే ఆన్‌లైన్‌లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, శివ పార్వతి, జిల్లా కోశాధికారి ఎండిదౌలా, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, కేదార్నాథ్, కోటిరెడ్డి, ప్రేమ్‌కుమార్, ప్రభాజీ తదితరులు పాల్గొన్నారు.

మొహమ్మద్ నసీర్‌ను గెలిపిద్దాం

● డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరుపున తూర్పు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్‌ను గెలిపించేందుకు కృషి చేస్తానని డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని జాకీర్ హుస్సేన్‌నగర్ 3వ లైను ఎస్‌వీఎస్ ప్లాజాలో శనివారం జరిగిన ఆర్ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉమాశంకర్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న నసీర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పారామెడికల్ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, డాక్టర్ శనక్కాయల రాజకుమారి, ఆర్ఎంపీ డాక్టర్లు, పారా మెడికల్ అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పారామెడికల్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న నసీర్, డేగల

మాదిగల ద్రోహి ముఖ్యమంత్రి జగన్ : ప్రేమానందం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 27 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉన్న మాదిగల ద్రోహి జగన్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ నగర అధికార ప్రతినిధి మంద ప్రేమానందం పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమిని గెలిపిస్తేనే ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని అన్నారు. 2019లో మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వని జగన్‌కు ఓటెయ్యటం ఎవరికి వారు ద్రోహం చేసుకోవటమేనని అన్నారు.

పశ్చిమ నియోజకవర్గ మ్యానిఫెస్టో విడుదల

గుంటూరు, ఏప్రిల్ 27: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వివిధ ప్రజా సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు వంటి ఏడు ప్రధాన అంశాలతో రూపొందించిన పశ్చిమ నియోజకవర్గ మ్యానిఫెస్టోను శనివారం బ్రాడీపేటలోని ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ టీ సేవ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకర్గం అభివృద్ధిపై 40 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో తాను మ్యానిఫెస్టోను రూపొందించినట్లు తెలిపారు. తనను గెలిపిస్తే మ్యానిఫెస్టోలో పేర్కొన్న రోడ్లు, డ్రైనేజ్, మంచినీటి సరఫరా, ట్రాఫిక్ సమస్యలు, విద్య, వైద్య సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ అధ్యక్షుడు పెళ్లకూరు సురేందర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

● పదేళ్ల ఎమ్మెల్యే ఒక్క వీధిలో అయినా తిరిగారా?

● తూర్పు నియోజకవర్గ పర్యటనలో డాక్టర్ పెమ్మసాని



భారీ గజమాలతో పెమ్మసాని, నసీర్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 151 సీట్లు ఇచ్చి పాలన చేయమంటే గంజాయి సరఫరా చేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపించారు. గుంటూరులోని తూర్పు నియోజకవర్గంలో పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గుంటూరులోని 50, 51, 52, 53, 54, 55, 56 డివిజన్లలో తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మహమ్మద్ నసీర్‌తో కలిసి పర్యటించారు. ప్రచారంలో పలు నివాసాలు, వస్త్ర, వాణిజ్య వ్యాపార సంస్థలను, ప్రజలను ఆయన కలుసుకున్నారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటూ, పలు వివరాలను సేకరించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ జన ప్రభంజనాన్ని చూస్తుంటే టీడీపీ స్వీప్ చేస్తుందని స్పష్టమవుతుందని అన్నారు. రాజధానిని బాగు చేయమని కోరితే జగన్ గంజాయిని పెంచి పోషించారన్నారు. జగన్ ప్రభుత్వపు గంజాయి, అవినీతి పాలనపై చర్చకు తాను సిద్ధమని సవాలు చేశారు. 2019కి ముందు జగన్ బ్రాండ్ల నాసిరకం మద్యం ఎక్కడైనా కనిపించిందా? రాజధాని ఎక్స్‌ప్రెస్, బూమ్ బూమ్, ప్రెసిడెంట్ మెడల్, పవర్ స్టార్ అంటూ ఎప్పుడూ వినని పేర్లతో మద్యం బ్రాండ్లు ప్రజలపైకి వదిలారన్నారు. ఎమ్మెల్యే బంధువులు బందిపోట్లు మాదిరిగా నియోజకవర్గాన్ని దోచుకున్నారన్నారు. పదేళ్లుగా ఎప్పుడైనా ఈ వీధుల్లో, సందుల్లో ఎమ్మెల్యే తిరిగారా? కృష్ణానది పక్కనే ఉన్నా, నీటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నా గుంటూరుకు ఎందుకు నీరు అందించలేకపోతున్నారు అని ప్రశ్నించారు. ఈ అసమర్థ పాలనలో రాజధాని లేదు, ఒక పరిశ్రమ లేదు, ఇక విద్యార్థులకు ఉపాధి ఎక్కడ నుంచి వస్తుంది? మళ్లీ లక్షల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారంటూ పెమ్మసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల పేరుతో రూ.5 వేలు ఇచ్చినంత మాత్రాన ప్రజల కడుపు నిండుతుందా? ఉపాధి అంటే నెలకు రూ. 30-40 వేలు దాకా సంపాదించుకోగలిగే అవకాశాలు కల్పించాలన్నారు. తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నసీర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచకపోగా, పేదల వ్యతిరేక ప్రభుత్వంగా మార్చిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎక్కడ చూసినా అరాచక పాలన చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. సంక్షేమం పేరిట పేదల జేబులకు చిల్లు పెట్టారన్నారు. పర్యటనలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నేరెళ్ల సురేష్ కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర వర్మ, ముప్పవరపు భారతి, ముజీబ్ తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నసీర్ సమక్షంలో చేరికలు

తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నసీర్ ఆధ్వర్యంలో రామిరెడ్డి తోటకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి కండవాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, వెంకట కోటయ్య, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పెద్ద ఏసు, అశోక్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నసీర్, డేగల ప్రభాకర్



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి, ఉండవల్లి, కాజా టోల్ ప్లాజ్ వద్ద వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా దాదాపు 145 మోటారు కార్లు, 27 కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు, 23 రవాణా వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం కరీం మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సరుకులను రవాణా చేస్తే డ్రైవర్లపై కేసు నమోదు చేసి, సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. తనిఖీలలో ఆర్టీవోలు గోపాల్, ప్రసాదు, మోటారు వాహన తనిఖీ అధికారులు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లేశ్వరీ, సంధ్య పాల్గొన్నారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

● ఏఐటీయూసీ నగర గౌరవాధ్యక్షుడు సురేష్ బాబు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27 : శ్రమ జీవుల పండుగ మేడేను నగరంలో ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ నగర గౌరవ అధ్యక్షులు జీ సురేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక సంగడిగుంట రేగుల రాఘవయ్య భవన్లో శనివారం మేడే సన్నాహక సభ నిర్వహించారు. సభకు నగర అధ్యక్షుడు రావుల అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ మేడే కార్యక్రమంలో ప్రతి కార్మికుడు పాల్గొని, తమ హక్కులకై గళం వినిపించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఇండియాకూటమి ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం ఇండియా కూటమితోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మేడా హనుమంత రావు, కోట మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, జంగాల చైతన్య, గంగాధర్, ముసల లక్ష్మయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, బాబు, శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్ బాబు, పక్కన జంగాల అజయ్‌కుమార్ తదితరులు

దుకాణాలపై కేసులు నమోదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: జిల్లా విజిలెన్స్ కమిటీ, లీగల్ మెట్రాలజి ఆధ్వర్యంలో స్థానిక పాతగుంటూరు మెయిన్ రోడ్‌లో పలు దుకాణాలపై శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.. ఈ సందర్భంగా బేకరీలలో ఒక కేజీ కేక్‌ను తూకం వేయగా కేవలం 8300 గ్రాములు ఉండటం, అలాగే పలు దుకాణాల్లో నిత్యావసర సరుకులను ఎంఆర్‌పీ కంటే అదనంగా విక్రయించడాన్ని గుర్తించారు. దీంతో లీగల్ మెట్రాలజి అధికారి సునీల్ కుమార్ దుకాణాలపై కేసులు నమోదు చేసి, కాటా యంత్రాలను సీజ్ చేశారు. తనిఖీలలో జిల్లా విజిలెన్స్ కమిటి సభ్యులు చదలవాడ హరిబాబు, కవిత, బేబి సరోజని, నాగమణి పాల్గొన్నారు.



దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రెల్లిలకు రాజకీయ ప్రాధాన్యం లేకపోవడం విచారకరం

● సంక్షేమ సంఘం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ యలమంచిలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27 : రాష్ట్రంలో 20 లక్షల మంది జనాభా ఉన్న రెల్లి కులానికి ప్రధాన పార్టీలు కేవలం ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం విచారకరమని రెల్లి సంక్షేమ సంఘం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ యలమంచిలి సామ్రాజ్యం అన్నారు. పాత గుంటూరులోని రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య రంగంలో నిరంతరం సేవలందిస్తూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న తమ జీవితాలలో మాత్రం మార్పు రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రెల్లిలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకు మాత్రమే తమ ఓటు వేస్తామని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

తాడిశెట్టి మురళి సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు

గుంటూరు, ఏప్రిల్ 27 : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ ఆధ్వర్యంలో అధికార వైసీపీని వీడి టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం గోరంట్ల, పెదపలకలూరు గ్రామాల ప్రజలతోపాటు, గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని సంగడిగుంట, ఇందిరా ప్రియదర్శిని కాలనీ వాసులు కడియం సుబ్బారావు నేతృత్వంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి తాడిశెట్టి మురళీ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ ఒక్క సీటు కూడా గెలవదు, గెలవనివ్వబోమని పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్‌ని అంధకారంలోకి నెట్టిన జగన్ ప్రభుత్వం పోవాలి అంటే..వెలుగులు నింపే టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని తెలిపారు. అధికార అహంకారంతో విర్రవీగే ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో సిద్ధంగా ఉన్నారని మురళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ బి కిషోర్, విజయ కిషోర్, రమేష్, వెంకటేష్, సీతా రామయ్య, పి.వెంకట రమేష్, నాగ గోపి, లక్ష్మీనారాయణ, వెంకట్రావు, కృష్ణ, లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, కృష్ణమూర్తి, గణేష్, వాసు, శివా, సత్యంబాబు పాల్గొన్నారు.



తాడిశెట్టి మురళీ సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

తలరాతను మార్చే సత్తా ఓటుకే ఉంది

● విద్యావేత్త చంద్రయ్య

గుంటూరు, ఏప్రిల్ 27: ప్రజల భవిష్యత్తును, దేశం తలరాతను మార్చే సత్తా ఒక్క ఓటుకే ఉందని విద్యావేత్త వై.చంద్రయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన ఓటర్ల చైతన్య సభలో ఆయన ప్రసంగించారు. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడానికి, తద్వారా మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలకు దక్కిన ఆయుధమే ఓటన్నారు. ప్రభుత్వ స్వరూపం, స్వభావం ప్రజలు విచక్షణతో వినియోగించిన ఓటుపై ఆధారపడి ఉంటాయని, ప్రభుత్వం మంచిదైనా, చెడ్డదైనా దాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రజలే బాధ్యత వహించవలసి వస్తుందన్నారు. మంచి నాయకత్వం లేకుండా మంచి ప్రభుత్వం, సమాజం సాకారం కావని మంచి నాయకులు సమాజానికి సేవ చేస్తే, దుష్ట నేతలు సంఘాన్ని దోచుకుంటారని, సమాజమే తమకు సేవ చేసే విధంగా మలుచుకుంటారన్నారు. విచక్షణగా ఆలోచన చేసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్‌వి సింగరయ్య, వీఎస్ఎన్ మల్లేశ్వరరావు, ఇంజనీర్ సదాశివం ప్రసంగించారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

● విశ్రాంత న్యాయమూర్తి వెంకటరమణ రాయలు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 27 : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి నైతిక విలువలు పెంపొందించేలా విద్య కొనసాగాలని విశ్రాంత న్యాయమూర్తి పి.వెంకటరమణ రాయలు అన్నారు. శనివారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో 39వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటరమణ రాయలు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో నైపుణ్యాలు సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. తల్లిదండ్రుల్ని గౌరవించడంతోపాటు విద్యార్థులకు సామాజిక బాధ్యత ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ చెరుకువాడ రంగనాథరాజు, కార్యదర్శి పీపీకే గోపాలరాజు, కోశాధికారి మాజేటి ప్రసాద్, ప్రిన్సిపల్ హేమాంబ తదితరులు పాల్గొన్నారు విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. స్థానిక అంశాల గురించి మోహనకృష్ణను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. **- గుంటూరు.**



టీడీపీలో చేరిన వారితో యువనేత లోకేశ్, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి

గల్లా మాధవి ఆధ్వర్యంలో భారీగా చేరికలు

● పార్టీలోకి ఆహ్వానించిన యువనేత లోకేశ్

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. తాజాగా శనివారం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి గల్లా మాధవి ఆధ్వర్యంలో, యువనేత లోకేశ్ సమక్షంలో భారీగా చేరికలు జరిగాయి. ఉండవల్లిలోని ఆయన నివాసంలో వారికి పసుపు కండువా కప్పి యువనేత పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ అయిదేళ్ల జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున నాయకులు తరలివచ్చి టీడీపీలో చేరుతున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు నేతృత్వంలో పనిచేయడానికి కలిసి వచ్చే వారందరికీ పార్టీ ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు. పార్టీలోకి కొత్తగా వస్తున్న నేతలు రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని, వారందరికీ అధికారంలోకి వచ్చాక తగిన గుర్తింపునిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో 19వ డివిజన్ కార్పొరేటర్ తేలుకుట్ల హనుమాయమ్మ, 23వ డివిజన్ కార్పొరేటర్ సాదు ఉమామహేశ్వరి, వైసీపీ మైనారిటీ విభాగం జిల్లా నాయకులు ఎస్‌కే మహబూబ్ బాషా, ఎస్‌కే బాషా, తుమ్మల నాగేశ్వరావు పాల్గొన్నారు. అలాగే పశ్చిమ నియోజకవర్గంలో గల్లా మాధవి ఆధ్వర్యంలో శనివారం భారీగా చేరికలు జరిగాయి. 24వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరగా, వారికి కండవాలు కప్పి ఆమె పార్టీలోకి ఆహ్వానించారు.



నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గల్లా మాధవి

ఎన్నికల తేదీ కోసం ఎదురు చూస్తున్న ప్రజలు : గల్లా

గుంటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు మే 13వ తేదీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. నగరంలోని 33వ డివిజన్ బ్రాడీపేటలో శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు గల్లా మాధవికి నీరాజనాలు పలికారు. గల్లా మాధవి మాట్లాడుతూ తాను ఎక్కడికెళ్లినా ప్రజలు ఆశీర్వదిస్తున్నారని, తనను ఇంతగా ఆదరిస్తున్న ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. ఐదేళ్లుగా వైసీపీ స్థానిక సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేసిందన్నారు. ఎప్పుడు వైసీపీని ఓడిద్దామా అని పోలింగ్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కూటమి అధికారంలోకి రాగానే స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి, సంక్షేమం, అభివృద్ధి అందరికీ అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పోపూరి నరేంద్ర, ఉప్పుటూరి పేరయ్య, కొనికి వినోద్, చింతకాయల శివ(జనసేన), తిరుపతయ్య(బీజేపీ), రంజిత్, గూడూరి రాంబాబు, వెంకటేష్ యాదవ్, పాశం నాగార్జున, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడ దెబ్బ రోగుల కోసం ఐసీయూ వార్డు

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 27 : ఈ వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ బాధితుల చికిత్స కోసం ఆరు పడకలతో కూడిన ఇంటెన్సీవ్ కేర్ యూనిట్ (ఐసీయూ) వార్డును ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి తెచ్చినట్లు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రత్యేక ఐసీయూ వార్డును శనివారం ఆయన ప్రారంభించారు. జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శైలజ పర్యవేక్షణలో వడ దెబ్బ రోగులకు ప్రత్యేక చికిత్సలు అందిస్తారన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటం వల్ల ప్రజలు వడ దెబ్బ బారిన పడే అవకాశం ఉందని ఆయన వివరించారు. బాధితుల్లో తలనొప్పి, తల తిరగడం, నీరసం, వికారం, శ్వాస పీల్చడం కష్టంగా మారడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వీరికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు.



ఐసీయూను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికలో శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ వారు నిర్వహిస్తున్న 14వ అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు ఐదో రోజున కొనసాగాయి. నూతలపాటి తిరుపతయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత జరిగిన సభకు వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రముఖ కవి, చిత్రకారుడు అక్కిరాజు శ్రీహరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ ఆంధ్ర నాట్య కళాకారుడు సంజయ్ వాడపల్లి, హాంగ్కాంగ్ వారిని అక్కిరాజు మనీప్రియ స్మారక సాత్రాజితి పురస్కారంతో, మొన్‌జిత్ షా(కోల్‌కత్తా) భరతనాట్య కళాకారుడు, మధువతి కులకర్ణి(బెంగళూరు) కూచిపూడి నృత్య కళాకారురాలిని సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం యువ కళారత్న పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, ఎర్రగుంట ప్రశాంతి పర్యవేక్షించారు.



కూచిపూడిని ప్రదర్శిస్తున్న కళాకారిణి


ఎన్నికల విధుల ఉత్తర్వులు జారీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి

ఆస్తిపన్ను.. బారెడు




ట్యాంకర్లతోనే నీటి సరఫరా..


పైప్‌లైన్ల మరమ్మతులు నిత్యకృత్యం...


పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం...


జోరుగా కొనసాగుతున్న ప్రైవేటు వ్యాపారుల నీటి సరఫరా..

- గత ఐదేళ్ల క్రితం ఉన్న పన్ను కంటే వందశాతం పెరుగుదల
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో గుంటూరు ప్రజలపై రూ.10.71 కోట్ల అదనపు భారం
- గత ఏడాది కంటే ఈ ఏడాది 15 శాతం ఆస్తి పన్ను పెంపు
- పారిశుధ్యం అధ్వానం, ఇంటింట చెత్తసేకరణ అరకొరగానే
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నగర ప్రజలు

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 27: గుంటూరు నగర ప్రజలపై ఆస్తిపన్ను భారం పడుతోంది. గత నాలుగేళ్లుగా ఏటా 15 శాతం నుంచి 25 శాతం వరకు పన్నన పెంచుతూనే ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం రాక మునుపు సుమారు రూ.100 చెల్లించేవారు ఇప్పుడు రూ.250 వరకు చెల్లించాల్సి వస్తోంది. సగటున 100 శాతం కంటే ఎక్కువ ఆస్తి పన్ను పెరిగింది. గుంటూరు నగరంలో మొత్తం 1,93,761 అసెస్మెంట్లకు గత ఏడాది 2023- 24లో రూ.108.36 కోట్ల డిమాండ్ ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి నగర ప్రజలపై అదనంగా రూ.10.71 కోట్లు ఆస్తి పన్నును పెంచారు. వాణిజ్య భవనాలకు అయితే చెప్పతరం కాదు.. ఇప్పటికే ప్రతి భవనానికి గడచిన నాలుగేళ్లలో 200 శాతం ఆస్తి పన్ను పెంచారు. దీంతో వ్యాపారవేత్తలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. గత్యంతరం లేక ఆస్తి పన్నును చెల్లిస్తున్నారు.

పారిశుధ్య అధ్వానంగా..

గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. నగరంలోని ప్రధాని వీధులన్నీ చెత్త నిండుకుంటున్నాయి. పారిశుధ్యంపై నగరపాలక సంస్థ దృష్టి పెట్టడం లేదు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మరికొందరు వర్కర్స్ పనులకు హాజరుకాకుండానే పూర్తిస్థాయిలో జీతాలు పుచ్చుకుంటున్నారు. దీనిపైన పర్యవేక్షించాల్సిన శానిటరీ సూపర్‌వైజర్లు, డిప్యూటీ కమిషనర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో నగరంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. అనేక జంక్షన్‌లలో చెత్త కుప్పలుగా పేరుకొని ఉండటం జరుగుతుంది. లాలాపేట, మార్కెట్ సెంటర్, సాంబశివపేట, బస్టాండ్ ప్రాంతం, కొల్లి శారదా మార్కెట్, గుంటూరు అంకమ్మ తల్లి గుడి వద్ద, ఆంజనేయస్వామి గుడి పక్క రోడ్డులో, బ్రాడీపేట, అరండల్ పేట, అమరావతి రోడ్డు, రింగ్ రోడ్డు, ఎస్వీఎన్ కాలనీ, బృందావన్ గార్డెన్ సెంటర్ ఇలా అనేక ప్రాంతాల్లో రోడ్లపైనే చెత్తచెదారం పేరుకుని ఉంటుంది. నగరంలో సుమారు 5 వందల మందికి పైగా పర్మినెంట్ వర్కర్లు, మరో 2000 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరితోపాటు మరో 25 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు సూపర్వైజర్లు, ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు పారిశుధ్య మెరుగుదలకు పర్యవేక్షిస్తున్నారు. వీరంతా ఎక్కడ పనిచేస్తున్నారో కానీ నగరంలో పారిశుధ్యం మాత్రం మెరుగుపడటం లేదు.

తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం...

నగరంలో త్రాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. ఇప్పటికి అనేక ప్రాంతాల్లో మురుగునీరు సరఫరా అవుతోంది. ఇటీవల పొన్నూరు రోడ్‌లోని సంగడిగుంట, లాంచెస్ట్ రోడ్డు, రెడ్ల బజారు, శ్రీనగర్, ఆనందపేట, యాదవ బజార్, శారదా కాలనీ, రైలుపేట, కొరటిపాడు, కోబల్డుపేట, క్రిస్టియన్ పేట, అంబేద్కర్ నగర్, సుగాలి కాలనీ, పీర్ తోట, అమరావతి రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, స్వర్ణ భారతి నగర్ ఇలా అనేక ప్రాంతాల్లో మురుగు నీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి వేసవికి ముందే గుంటూరు నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. పూర్తిస్థాయిలో నీరు సరఫరా కాకపోవటం, ప్రధాన పైప్‌లైన్లు లీకులు ఉండటం, క్షేత్రస్థాయిలో నీటి సరఫరాలో ఇంజనీరింగ్ అధికారులు విఫలమయ్యారు. ప్రగతి నగర్, హిమనీ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్ 1, 2 లో ఇప్పటికి నీటి పైపులు లేవు. నగరంలో 30 శాతం పైప్ లైన్లు లేని ప్రాంతాలు ఉన్నాయి. వాటన్నిటికీ అరకు రాగానే ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. రూ.460 కోట్లతో చేపట్టిన సమగ్ర తాగునీటి పథకం పనులు ఏమయ్యాయో, ఎంతవరకు పూర్తయ్యాయో దేవుడికే ఎరుక...!

ఆస్తి పన్ను వంద శాతం పెంచారు..



నగరంలోని రామన్నపేట కోళ్లఫారం సెంటర్లో ఉన్న మా ఇంటికి గడచిన నాలుగేళ్లలో ఆస్తి పన్ను విపరీతంగా పెరిగింది. కానీ అదే స్థాయిలో మౌలిక వసతులు కల్పించడం లేదు. గతంలో రూ.1,500 ఉండే పన్నుకి ఇప్పుడు రూ.3,250 చెల్లిస్తున్నాం. అయినా ఇంటింటా చెత్త సేకరణ జరగటం లేదు. ఈ విధంగా ఆస్తి పన్ను పెంచుకుంటూ పోతే ప్రజల పరిస్థితి ఏంటి..?

\- పోలా శ్రీనివాసరావు

మురుగునీరు సరఫరా అవుతోంది..



నగరంలోని కోబాల్డ్‌పేట ఏడో లైన్‌లో మా ఇంటికి మురుగనీరే వస్తుంది. గత ఐదేళ్ల క్రితం రూ.80 ఆస్తి పని చెల్లించే వాళ్ళం. ఇప్పుడు మూడు వేలకు పైగా ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇంటింటా చెత్త సేకరణ మా ప్రాంతంలో జరగటం లేదు. గత నెల రోజులుగా మురుగునీరు మాత్రమే సరఫరా అవుతున్నాయి. దీంతో మున్సిపల్ నీరు తాగాలంటేనే భయం వేస్తుంది.

\- షేక్ సబీరా

ఎన్నికల విధుల్లో 13,800 మంది

- ఉద్యోగులకు నియోజకవర్గాలు కేటాయింపు
- ఉత్తర్వులను విడుదల చేసిన జిల్లా ఎన్నికల అధికారి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఎన్నికల విధులకు అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 13,800 ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయించారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అదర్ పోలింగ్ అధికారులుగా నియమించిన ఉద్యోగులను అసెంబ్లీ నియోజకవర్గాల కేటాయింపునకు శనివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఎన్ఐసీ పోర్టల్ ద్వారా ఎన్నికల విధుల ఉత్తర్వులను విడుదల చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 1915 పోలింగ్ కేంద్రాల్లో రిజర్వు సిబ్బందితో కలిపి పీవోలుగా 2300 మంది, ఏపీవోలుగా 2300 మంది, ఓపీవోలుగా 9200 మంది మొత్తం 13,800 మంది ఉద్యోగులకు విధులు నిర్వహించాల్సిన నియోజకవర్గాలు కేటాయించారు.

ఈ కార్యక్రమంలో మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్, మంగళగిరి రిటర్నింగ్ అధికారి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, నోడల్ అధికారులు శైలజ, రఘు, లోక్‌సభ నియోజకవర్గ ఏఈఆర్వో బీమారావు, ఎన్ఐసీ డీఐవో బిమల్‌కుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 17,91,543

- తుది ఓటర్ల జాబితా విడుదల

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం వినియోగించే తుది ఓటర్ల జాబితా విడుదలైంది. 2024 ఎస్ఎస్ఆర్ ఈ ఏడాది జనవరి 22న విడుదలైన విషయం తెలిసిందే. అప్పటి వరకు ఉన్న పెండింగ్ క్లెయిమ్‌లు, ఆ తర్వాత వచ్చిన వాటన్నింటిని ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు ఈఆర్‌వోలు పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను శనివారం రాత్రి విడుదల చేశారు. కొత్తగా చేసిన చేర్పులు, తొలగింపులను ఓటర్ జాబితాల్లో అప్‌డేట్ చేసి పోలింగ్‌కు ముందు పీవోలకు అందజేస్తారు. అలానే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సాఫ్ట్, హార్డ్ కాపీలను పంపినట్లు జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
తాడికొండ	100093	107521	1	207615
మంగళగిరి	140660	151759	13	292432
పొన్నూరు	109008	118116	11	227135
తెనాలి	129077	138514	33	267624
ప్రత్తిపాడు	129264	138601	23	267888
గుంటూరు పశ్చిమ	135426	142688	44	278158
గుంటూరు తూర్పు	121849	128808	34	250691
మొత్తం	865377	926007	159	1791543

తొలి స్పీకర్‌లు.. ఇక్కడి వారే


నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి


డాక్టర్ కోడెల శివప్రసాదరావు


- ఆంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ నల్లపాటి
- నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్ డాక్టర్ కోడెల

నరసరావుపేట, ఏప్రిల్27: పల్నాడు జిల్లా నేతలకు అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రరాష్ట్ర తొలి స్పీకరుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌద రి, నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా డాక్టర్ కోడె ల శివప్రసాదరావు పనిచేశారు. 1955లో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ శాసనసభకు నరస రావుపేట న్యాయవాది నల్లపాటి వెంక ట్రామయ్య తొలి స్పీకర్‌గా పనిచేశారు. నల్లపాటి నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. 1952లో జరిగిన ఎన్నికల్లో కేఎంపీపీ అభ్యర్థిగా పోటీచేసిన నల్లపాటి కాంగ్రెస్ అభ్యర్థి కేవీ రెడ్డిపై విజయం సాధించారు. 1955లో జరి గిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి సీపీఐ అభ్యర్థి కే రంగా రావుపై గెలుపొందారు. వరు సగా రెండోసారి ఎన్నికైన వెంకట్రామయ్య చౌదరిని శాసనసభాపతిగా ఎన్నుకొన్నారు.

నవ్యాంధ్ర తొలి శాసన సభాపతిగా 2014లో డాక్టర్ కోడెల శివప్రసాదరావును ఎన్నుకున్నారు. ఆయన ఐదేళ్లపాటు స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. స్పీకర్‌గా పలు కార్యక్రమాలను నిర్వహించి అయన ప్రత్యేక గుర్తింపు సాధించారు. డాక్టర్ కోడెల ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. తెలుగుదేశం ఆవిర్భావంతో పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు పిలుపుతో ప్రత్యక్ష రాజకీ యాల్లోకి అడుగుడిన కోడెల అనతి కాలంతోనే రాష్ట్రంలో ప్రత్యేక గుర్తిం పు పొందిన నాయకుడిగా ఎదిగా రు. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా నరసరావు పేట నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలు పొందారు. 2004, 2209 ఎన్నికల్లో నర సరావుపేట నుంచి పోటీ చేసి ఓట మిని చవిచూ సిన కోడెల 2014లో సత్తెనపల్లి నియోజక వర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయ నను నవ్యాంధ్ర తొలి శాసనసభాపతి పదవి వరిం చింది. స్పీకర్‌గా సమర్థంగా విధులు నిర్వహించిన నేతగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం హోంశాఖ వంటి కీలక మంత్రి పదవులను అయన అలంకరించారు.

వారసులొచ్చారు

- ఎన్నికల బరిలో రాజకీయ వారసులు
- మాజీ మంత్రుల తనయులు, కుటుంబ సభ్యులు



గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యానికి మారుపేరుగా ఉన్న గుంటూరు జిల్లాలో ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ, శాసనసభలకు పలువురు వారసులు బరిలోకి దిగారు. దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న సీనియర్ నేతలు తమ పిల్లలు, కుటుంబ సభ్యులను చట్టసభలకు పంపాలని ప్రయత్నిస్తున్నారు. ఆయా కుటుంబాల నుంచి రాజకీయాల్లోకి వచ్చిన యువనేతలు ఇప్పటికే చట్టసభల్లో ప్రవేశించిన వారు కొంతమంది ఉండగా మరికొంత మంది ఈ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో బరిలో ఉన్న వారసుల వివరాలు ఇలా ఉన్నాయి..

నారా చంద్రబాబు - లోకేశ్

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు లోకేశ్ ఈ ఎన్నికల్లో మరోసారి మంగళగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో లోకేశ్ ఓటమి పాలైనా నియోజకవర్గాన్ని విస్మరించకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి వారి మన్ననలు పొందారు. ఈ దఫా భారీ మెజార్టీతో గెలుపొందడానికి ఆయన శ్రమిస్తున్నారు. లోకేశ్ గతంలో ఎమ్మెల్సీగా, రాష్ట్రమంత్రిగా కొనసాగారు. చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా చంద్రగిరి, కుప్పం నుంచి ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా, టీడీపీ రాష్ట్ర జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు వారసుడు లోకేశ్ రెండోసారి చట్ట సభలకు పోటీ చేస్తున్నారు.

నాదెండ్ల భాస్కరరావు - మనోహర్

నాదెండ్ల భాస్కరరావు జిల్లాలోని వేమూరు, తెనాలి నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా చేశారు. నెల రోజులు ముఖ్యమంత్రిగా కొనసాగారు. నాదెండ్ల తనయుడు మనోహర్ 2004, 2009లో తెనాలి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ చివరి స్పీకర్‌గా కొనసాగారు. 2014 ఎన్నికల్లో మనోహర్ కాంగ్రెస్, 2019లో జనసేన తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ దఫా ఎన్‌డీఏ కూటమి మద్దతుతో జనసేన తరుపున పోటీకి దిగారు.

అన్నాబత్తుని సత్యనారాయణ - శివకుమార్

అన్నాబత్తుని సత్యన్నారాయణ తెనాలి మున్సిపల్ ఛైర్మన్‌గా, శాసనసభ్యునిగా, మంత్రిగా టీడీపీ తరపున పనిచేశారు. సత్యనారాయణ 1983, 85లో టీడీపీ ఎమ్మెల్యేగా తెనాలిలో గెలుపొందారు. ఆయన 1984 - 85లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన తనయుడు శివకుమార్ 2014లో పోటీ చేసి ఓడిపోయినా గత 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఈసారి కూడా ఆయనే తిరిగి బరిలోకి దిగారు.

ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి - నరేంద్రకుమార్

పొన్నూరులో 1983, 85లో ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి టీడీపీ శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ఆయన 1988 - 89లో రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా పనిచేశారు. సుదీర్ఘకాలం సంగం డెయిరీ ఛైర్మన్‌గా కొనసాగారు. 1989లో రెవెన్యూ మంత్రిగా పోటీ చేసి ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. 1994 ఎన్నికల ముందు రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. దీంతో తనయుడు నరేంద్రకుమార్ 1994 - 2014 వరకు ఐదుసార్లు ఇక్కడ పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నరేంద్రకుమార్ గత 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ఈ దఫా టీడీపీ అభ్యర్థిగా ఆయనే బరిలోకి దిగారు. ఈ విధంగా ధూళిపాళ్ళ కుటుంబం 1983 నుంచి పొన్నూరులో అసెంబ్లీకి పోటీ చేస్తూనే ఉంది.

ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు - కిలారి రోశయ్య

వైసీపీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ శాసనమండలి ఫ్లోర్ లీడర్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అల్లుడు కిలారి రోశయ్య గత 2019 ఎన్నికల్లో పొన్నూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా గెలుపొందారు. అంతకు ముందు 2009లో తెనాలి పీఆర్‌పీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఈ దఫా గుంటూరు లోక్‌సభ సభ్యుడిగా వైసీపీ తరఫున పోటీ చేస్తున్నారు. ఉమ్మారెడ్డి 1985లో బాపట్ల ఎమ్మెల్యేగా, 1991, 1999 తెనాలి, 1996 బాపట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1996 - 1998లో కేంద్రమంత్రిగా పని చేశారు.

కోన ప్రభాకరరావు - రఘుపతి

బాపట్లలో హ్యాట్రిక్ సాధించిన కోన ప్రభాకరరావు తనయుడు సిట్టింగ్ ఎమ్మెల్యే రఘుపతి ఈ ఎన్నికల్లో బాపట్లలోని వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నారు. కోన ప్రభాకరరావు రాష్ట్ర మంత్రిగా, గవర్నర్‌గా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. రఘుపతి 2009లో బాపట్లలో కాంగ్రెస్ రెబల్‌గా పోటీ చేసి ఓడిపోయారు. 2014, 19లో వైసీపీ అభ్యర్థిగా గెలుపొందిన రఘుపతి తిరిగి ఈ ఎన్నికల్లో మరలా పోటీలో ఉన్నారు.

కాసు కృష్ణారెడ్డి - మహేష్‌రెడ్డి

మాజీమంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి తనయుడు మహేష్‌రెడ్డి ఈ ఎన్నికల్లో మరోసారి గురజాల నుంచి వైసీపీ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. కృష్ణారెడ్డి నరసరావుపేట ఎంపీగా, ఎమ్మెల్యేగా కొనసాగారు. మూడు సార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.

అనగాని భగవంతరావు - సత్యప్రసాద్

మాజీ మంత్రి దివంగత అనగాని భగవంతరావు కుమారుడు సిట్టింగ్ ఎమ్మెల్యే సత్యప్రసాద్ రేపల్లె నుంచి మరోసారి బరిలోకి దిగారు. భగవంతరావు కూచినపూడి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత సత్యప్రసాద్ 2009లో రేపల్లెలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మోపిదేవి వెంకటరమణపై ఓడిపోయారు. 2014, 19లో గెలుపొందిన సత్యప్రసాద్ మరోసారి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్నారు.

ముస్తఫా - నూరి ఫాతిమా

2014, 19లో వరుసగా రెండుసార్లు మొహమ్మద్ ముస్తఫా వైసీపీ తరపున గుంటూరు తూర్పు నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆయన తన రాజకీయ వారసురాలిగా కుమార్తె నూరి ఫాతిమాని తెర పైకి తీసుకొచ్చారు. ఆమెకు గుంటూరు తూర్పు వైసీపీ టిక్కెట్ ఇప్పించి ప్రప్రథమంగా ఎన్నికల బరిలో దింపారు.

జూలకంటి దుర్గాంబ - బ్రహ్మారెడ్డి

రాజకీయ నేపథ్యం కలిగిన జూలకంటి కుటుంబంలో 1999లో జూలకంటి దుర్గాంబ మాచర్లలో టీడీపీ తరుపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో ఆమె తన రాజకీయ వారసుడిగా బ్రహ్మారెడ్డిని పోటీ చేయించగా ఆయన ఓటమి పాలయ్యారు. 2009లోనూ బ్రహ్మారెడ్డి ఓడిపోయారు. అయితే ఆయన్ని తిరిగి మాచర్ల నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా చంద్రబాబు నియమించిన తర్వాత క్యాడర్‌లో రెట్టించిన ఉత్సాహం వచ్చింది. దాంతో ఈ దఫా బ్రహ్మారెడ్డినే టీడీపీ బరిలోకి దింపింది.

రేపటితో నామినేషన్ల ఉపసంహరణ గడవు ముగింపు

- గుంటూరు లోక్‌సభకు రాష్ట్రంలోనే అత్యధికంగా నామినేషన్ల దాఖలు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల ఘట్టం సోమవారం సాయంత్రంతో ముగియనుంది. ఇప్పటికే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు, అధికారుల స్క్రూటినీ ముగిశాయి. ఇక చివరిదైన నామినేషన్ల ఉపసంహరణ సోమవారం సాయంత్రం 3 గంటలకు ముగియనుంది. ఆలోపు ఎవరైతే రిటర్నింగ్ అధికారి కార్యాలయం ప్రాంగణంలోకి చేరుకుంటారో వారివి మాత్రమే నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత బరిలో ఉన్న తుది అభ్యర్థుల పేర్లతో జాబితాలు విడుదల చేస్తారు. అలానే గుర్తుల కేటాయింపు కూడా పూర్తి చేస్తారు. అనంతరం బ్యాలెట్ పేపర్ ముద్రణకు పంపుతారు. కాగా రాష్ట్రంలోనే గుంటూరు లోక్‌సభ స్థానానికి అత్యధికంగా 47 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు సీఈవో ముఖేష్‌కుమార్ మీనా ప్రకటించారు. కాగా వారిలో 13 నామినేషన్లను తిరస్కరించిన అనంతరం ఇంకా 34 మంది బరిలో ఉన్నారు వీరిలో ఎంతమంది తమ నామినేషన్లను సోమవారం సాయంత్రం లోపు ఉపసంహరించుకుంటారో చూడాలి. దానిని బట్టే పోలింగ్‌కు ఒక బ్యాలెట్ యూనిట్ వినియోగించాలా... అదనంగా మరికొన్ని జోడించాలా అనేది నిర్ణయమౌతుంది. అలానే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 181 మంది నామినేషన్లు దాఖలు చేయగా వారిలో 40 మందివి తిరస్కరించారు. ప్రస్తుతానికి 141 మంది పోటీలో ఉన్నారు. వీరిలో ఎంతమంది నామినేషన్లను ఉపసంహరించుకుంటారో సోమవారం సాయంత్రంతో తేలిపోతుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మంగళగిరి, ఏప్రిల్ 27: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. ఆటోనగర్, ఎన్నారై వెనుక వైపు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు నారా లోకేశ్ పర్యటన వివరాలు

మంగళగిరి, ఏప్రిల్ 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు మంగళగిరి మండలం నీరుకొండ గ్రామప్రజలతో సమావేశమవుతారు. సాయంత్రం 4:30 గంటలకు దుగ్గిరాల మండలం గొడవర్రు, 6 గంటలకు తాడేపల్లి పట్టణం 15, 16 వార్డులు, 7:30 గంటలకు తాడేపల్లి మండలం పెనుమాక గ్రామాల్లో జరిగే రచ్చబండలో లోకేశ్ పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆరుగురు వలంటీర్ల రాజీనామా


యలమందకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 27: వట్టిచెరుకూరు గ్రామంలో వలంటీర్లుగా విధుల నిర్వహిస్తున్న ఆరుగురు తమ విధులకు రాజీనామా చేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా శనివారం రాజీనామా పత్రాలను సచివాలయంలో ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో విధులు నిర్వహిస్తున్న యలమందకు అందజేశారు. వట్టిచెరుకూరులో 22మంది వలంటీర్లు విధులు నిర్వహిస్తుండగా వారిలో బత్తినేని అనూషా, సోమేపల్లి అనూషా, త్రివేణి, షేక్ ఖాశించి, షేక్ ఆషాబీలు తమ రాజీనామా పత్రాలను సచివాలయంలో సెక్రటరి లేని కారణంగా ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న యలమందకు అందజేసినట్లు వారు తెలిపారు.

రాష్ట్రంలో అరాచక పాలన అంతం చేయాలి

● బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తాడికొండ, ఏప్రిల్ 27: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. శనివారం మండలంలోని దామరపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులైన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలకు పదిశాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇస్తే ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ నిర్వీర్యం చేసిందన్నారు. మద్యపాన నిషేధహామీని తాకట్టు పెట్టి మద్యంపైనే అప్పులు తెచ్చారు. మూడు వేల కోట్లు ధరల స్థిరీకరణ నిధి ఊసే లేకుండా పోయిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో కులాల కుంపట్లు పెట్టారన్నారు. పేదలకు బిస్కెట్లు ఇచ్చి జగన్ ఇంట్లో బంగారు బిస్కెట్లు పేర్చుకున్నాడన్నారు. ఆర్టికల్ 293 నిబంధనలు బేఖాతరు చేస్తూ ఎఫ్‌ఎంబీ పరిధి దాటి తెచ్చిన రుణాలు ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి తెచ్చిన రుణాలు, కాంట్రాక్టర్లకు ప్రభుత్వ సప్లయర్లకు చెల్లించవలసిన బిల్లులు తడిసి మోపెడై రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారన్నారు. ఇంటింటికి తిరిగి ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సరిపూడి సాంబశివరావు, కోట సాంబశివరావు, ఎస్‌కే బిలాల్, ఆరుద్ర గోపి, వట్టికూటి మాధవరావు, శ్రీనివాసరావు, వెంకట్రావులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించాలి


నిడమర్రు రోడ్డులో ప్రచారం చేస్తున్న సీపీఎం శ్రేణులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 27: ప్రజాసమస్యలు పరిష్కారం కావాలంటే రాబోయే ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. ఇండియా కూటమి తరపున మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్నా శివశంకర్‌రావు, గుంటూరు పార్ల మెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం చేనేత మగ్గాల పెడ్లు, 30, 31 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు జేవీ రాఘవులు, పీ బాలకృష్ణ, ఎస్ఎస్ చెంగయ్య, కమలాకర్, ఏడుకొండలు, కాటమరాజు, ఖాశీం వహీద్, హనుమంతరెడ్డి, యశ్వంత్, నవిత తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఏలుబడిలో రాష్ట్రం సర్వనాశనం

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ


అందె శివశంకరరావు కుటుంబసభ్యులతో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 27: అయిదేళ్ల జగన్ ఏలుబడిలో రాష్ట్రం సర్వనాశనమైందని.. పన్నుల మోత, ధరల వాత తప్ప సామాన్యుడికి ఒరిగిందేమీ లేదని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరి పట్టణంలోని 18, 24, 25, 26 వార్డులకు చెందిన పలువురు ప్రముఖులను శనివారం ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకుని స్థానిక పరిస్థితులపై చర్చించారు. సాహితీ రంగ ప్రముఖుడు, చేనేత పారిశ్రామికవేత్త పొట్లాబత్తుని లక్ష్మణరావు, బీజేపీ రాష్ట్ర నేత అందె శివశంకరరావు, చేనేత వస్త్ర వ్యాపారులు వంగర హనుమంతరావు, సీపీఎం నేత గుంటి కృష్ణ, స్వర్ణకార వృత్తిదారులు మునగపాటి వేణు, కాటాబత్తుల శేషగిరి కుటుంబసభ్యులతో ఆమె భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓడినప్పటికీ నారా లోకేశ్ మంగళగిరి ప్రజలతో మమేకమై తన సొంత ఖర్చులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా రాబోయే ఎన్నికల్లో లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైసీపీ అయిదేళ్ల పాలనలో అన్ని రకాల పన్నులను పెంచేసి ప్రజలపై భారాలను మోపారని విమర్శించారు. కొత్త పరిశ్రమలు రాకపోవడంతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని చెప్పారు. రాష్ట్రంలో భూమి, ఇసుక, మద్యం మాఫియా వేళ్లూనుకుపోయిందని, అధికార పార్టీ నేతలు రూ.వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. మంగళగిరిలో కాండ్రు, మురుగుడు కుటుంబాలకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజా సమస్యలు, ఈ ప్రాంత అభివృద్ధి ఏమాత్రం పట్టవని విమర్శించారు. మంగళగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, నేతలు దామర్ల పద్మజ, ఊట్ల దుర్గామల్లేశ్వరీ, విజమూరి ఆషాబాల, మున్నంగి శివశేషగిరిరావు, గుంటి నాగరాజు, ఊట్ల కనకం, దాసు, గంజి లక్ష్మయ్య, బిట్రా నాగేశ్వరరావు, వెలుగోటి అన్నపూర్ణ, మండ్రు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంపదను కొల్లగొట్టిన జగన్‌రెడ్డి

● సంక్షేమం పేరిట ప్రజలను మభ్యపెట్టారు
● ఎస్సీ,ఎస్టీ, బీసీలపై పెరిగిన దాడులు
● కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్


నిడుముక్కలలో రోడ్ షోలో మహిళలతో తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ ఏప్రిల్ 27: రాజధాని అమరావతి ద్వారా వచ్చే సంపదను సీఎం జగన్మోహనరెడ్డి కొల్లగొట్టారని నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి తాడికొండ మండలం బేజాత్‌పురం, నిడుముక్కల గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జగన్ ఇస్తున్నవి నవరత్నాలు కాదని నవ మోసాలన్నారు. సంక్షేమం పేరిట ప్రజలను మభ్య పెట్టారన్నారు. పింఛన్ల కోత, అమ్మఒడి నిబంధనల పేరిట తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారన్నారు. చంద్రబాబు పాలనలో అంతటా అభివృద్ధి జరిగిందన్నారు. జగన్ పాలనలో అంతా విధ్వంసం చేశారన్నారు. అమరావతిని అపేశారు, పోలవరం నాశనం చేశారన్నారు. జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగాయన్నారు. అమరావతిలో జాతీయ అంతర్జాతీయ సంస్థల నిర్మాణం నిలిపివేశారన్నారు. టిడ్కో గృహాలు 90 శాతం చంద్రబాబు నిర్మిస్తే మిగిలిన 10శాతం పూర్తి చేయటానికి నాలుగు సంవత్సరాలు జగన్‌కు పట్టిందన్నారు. పేదలు పేదలుగానే ఉండటానికి సీఎం ప్రయత్నం చేస్తు న్నారన్నారు. రాజధానిలో పదివేల కోట్ల రూపాయల పనులు జరిగాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కువగా నష్టపోయింది రాజధాని ప్రాంత వాసులన్నారు. రాజధానిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ తప్పుడు ఆరోపణలు ప్రచారం చేశారన్నారు. అమరావతి పై అడుగడుగునా విషం చిమ్మిన వ్యక్తి సీఎం జగన్మోహనరెడ్డి అని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో అధికార పార్టీ నేతల అండతో ఇసుక, మట్టి, రోడ్డు, కంకర మట్టి చోరీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజాదరణ పొందుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, మాజీ సర్పంచ్ ఇనుకొల్లు అనిల్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు వడ్లమూడి సుధీర్, బండ్ల శ్రీకాంత్, తెలుగుయువత అధ్యక్షుడు నియోజకవర్గ చిగురుపాటి అనూఫ్, వడ్లమూడి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల పథకాలను రద్దు చేసిన జగన్

మాజీ ఎంపీపీ రిజ్వానా, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఘని


అమీనాబాద్‌లో మైనార్టీలతో మాట్లాడుతున్న అబ్దుల్ ఘని, షేక్ రిజ్వానాలు

ఫిరంగిపురం, ఏప్రిల్ 27 : రాష్ట్రంలో మైనార్టీల పథకాలను వైఎస్ జగన్ రద్దు చేసి మోసగించాడని మాజీ ఎంపీపీ రిజ్వానా, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఘనిలు అన్నారు. శనివారం మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు, నుదురుపాడు, 113 తాళ్ళూరు, మునగపాడు, గుండాలపాడు, శిరిగిపాలెం బేతపూడి గ్రామాల్లో పర్యటించి మైనార్టీ నాయకులతో కలసి మాట్లాడారు. మైనార్టీలకు చంద్రబాబు హయాంలో విదేశీ విద్యకు రూ.15 లక్షలు, షాదీఖానాలు కట్టించించారని వారు తెలిపారు. చంద్రన్న బీమా ద్వారా రూ.10 లక్షలు, దుల్హన్ పథకం కింద రూ.లక్ష ఇచ్చి ప్రోత్సహించిందని వారు తెలిపారు. దుకాన్ ఔర్ మకాన్ ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనే వారికి సహకారం అందించారన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్ కోసం కోర్టులో పోరాడాల్సిన దుస్థితి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీలకు వచ్చే పథకాలన్నీ వైఎస్ జగన్ రద్దు చేసి ఇస్లాం బ్యాంక్ ఇస్తానని నమ్మబలికి పథకాన్ని నీరు గార్చారని వారు విమర్శించారు. సూపర్ - 6 పథకాల ద్వారా చంద్రబాబు ప్రజలను ఆదుకోనున్నారని వారు తెలిపారు. కనుకనే టీడీపీ అభ్యర్థులైన తెనాలి శ్రావణ్‌కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో బత్తుల రమేష్, దరియా, సలీం, నాగుల్ హుస్సేన్, రహీం బేగ్, ఆదం షఫీ, షేక్ సద్దాం, బాబావలి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మహమ్మద్ యాకోబు, నుదురుపాడు మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిల్వ ఇసుకను సీజ్ చేసిన పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ ఇసుక నిల్వ

తుళ్లూరు, ఏప్రిల్ 27: మండల పరిధిలోని ఉద్దండ్రాయునిపాలెం మోదులింగాయపాలెం మధ్యలో అక్రమంగా దాదాపు 30 లారీల ఇసుక నిల్వ ఉంచిన డంప్‌ను తుళ్లూరు పోలీసులు గుర్తించి శనివారం సాయంత్రం సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు సీఐ సుభానీ తెలిపారు. ఈ ఐదు సంవత్సరాల నుంచి వైసీపీకి చెందిన ఓ ఎంపీ ఉద్దండ్రాయునిపాలెంలో తిష్ట వేసి అక్రమ ఇసుక రవాణా సాగిస్తున్నారు. ఎన్జీటీ కోర్టులో తుళ్లూరు మండలంలోని ఇసుక రీచ్‌ల కేసు ఉంది. అవి నిషేధిత జాబితాలో ఉన్నాయి.

నిలువ నీడ కరువాయే..

● బస్ షెల్టర్ లేక ఎండలో మాడుతున్న ప్రయాణికులు


ప్రాతూరు క్రాస్ రోడ్ వద్ద కారు పక్కనే నిలబడ్డ ప్రయాణికులు

తాడేపల్లి, ఏప్రిల్ 27: తాడేపల్లి బైపాస్ రోడ్ ప్రాంతంలో ప్రాతూరు క్రాస్ రోడ్ వద్ద కనీసం ప్రయాణికులు నిలబడేందుకు బస్ షెల్టర్ కూడా లేక ఎండలో మాడుతూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రాతూరు క్రాస్ రోడ్ వద్దకు నిత్యం అటు కుంచనపల్లి వైపు వెళ్లే గ్రామాల వారు, ఇటు మంగళగిరి వైపు వెళ్లేవారు ఎదురుగా ఉన్న అండర్‌పాస్ నుంచి తాడేపల్లి వెళ్లేందుకు ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం ఈ ప్రాంతంలో నిరీక్షిస్తూ ఉంటారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఈ ప్రాంతంలో ఉన్నాయి. నిత్యం పనుల మీద వచ్చే వారు కూడా ఈ ప్రాంతంలో దిగుతూ ఉంటారు. అయితే ఇంత ప్రాముఖ్యమున్న ఈ సెంటర్‌లో కనీసం చిన్నపాటి బస్ షెల్టర్ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఎండలోనే ఆటోలు, బస్సుల కోసం నిరీక్షిస్తూ నరకయాతన పడుతున్నారు. కొందరు ఎండకు తాళలేక సమీపంలో ఉండే కొట్ల వద్ద హోటళ్ల వద్ద నిలబడాల్సి వస్తుంది. ఈ లోపు బస్సులు వచ్చి వెళ్లిపోతున్నాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిలువనీడ కూడా కరువైందని ఈ మార్గంలో ప్రయాణం చేసే గ్రామస్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. అధికార గణం స్పందించాలని కోరుతున్నారు.

రచ్చబండ విజయవంతంపై హర్షం

మంగళగిరి, ఏప్రిల్ 27: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో శనివారం సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ నిర్వహించిన రచ్చబండ కార్యక్రమం విజయవంతం కావడంపై గ్రామ టీడీపీ శ్రేణులు హర్షం వెలిబుచ్చాయి. రచ్చబండంలో పాల్గొని విజయవంతం చేసిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. పెదవడ్లపూడి టీడీపీ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, క్లస్టర్ ఇన్‌చార్జి మాదల రమేష్‌బాబు, నేతలు గుడిమెట్ల మరియదాసు, కొడవలి ఆనంద్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, అన్నే చంద్రశేఖర్, బోయపాటి రవి, కఠారి సాంబయ్య, జాన్‌బాబు, ఖదీర్, మద్దుకూరి రమేష్, యేళ్ల ప్రవీణ్, పత్రా శ్రీను, కట్టా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మ్యానిఫెస్టో క్లీన్ బౌల్డ్ : పాతర్ల రమేష్

తాడేపల్లి, ఏప్రిల్ 27: బాబు సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో దెబ్బకు జగన్ మ్యానిఫెస్టో క్లీన్ బౌల్డ్ అయిందని జగన్ చెప్పేవన్నీ అబద్దాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూడా మ్యానిఫెస్టోలో చెప్పినవన్నీ పచ్చి అబద్దాలేనని.. వైసీపీ మ్యానిఫెస్టో పాత సీసాలో కొత్త సారాలాగా ఉందని జనాలను మరోసారి మోసగించేందుకు జగన్ సిద్ధమయ్యారని అయితే ఈసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. పింఛన్ల పంపిణీపై జగన్ నీచరాజకీయాలు మానుకోవాలని, ఒకటో తేదీనే ఇంటి నుంచే పేదలకు పింఛన్ పంపిణీ చేయాలని సచివాలయాలు, పంచాయతీలు, రెవెన్యూ కార్యాలయాల్లో తగినంత మంది సిబ్బంది ఉన్నారని ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని రమేష్ అన్నారు. శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు సీఎస్ జవహర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారన్నారు.

ఏ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయలేదు

● విమర్శించిన రాజధాని రైతులు, మహిళలు


తాడికొండలో నిరసనలు వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

తాడికొండ, ఏప్రిల్ 27: మూడు రాజధానులు ప్రకటించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయలేదని రైతులు, మహిళలు విమర్శించారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు, శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పగ, ప్రతీకారాలు, కూల్చివేతలు, రద్దులు, అరెస్టులపై చూపుతున్న పట్టుదల రాష్ట్రాభివృద్ధిపై చూపలేదని విమర్శించారు. కేంద్రం గతంలో సహకరించి ఉంటే ఇప్పటికే అంతర్జాతీయ రాజధానిని రూపొందించుకునే వాళ్లమన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రాజధానులు అక్కడి వెళితేనే అభివృద్ధి చెందుతాయనటం విడ్డూరం అన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరణ చేయాలి కాని, పాలనా వికేంద్రీకరణ వల్ల అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. రైతు శ్రమకు విలువలేదు, రైతు త్యాగాలకు గుర్తింపు లేదు, అన్నంపెట్టే రైతుకు ఆదరణలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతికి భూములు ఇచ్చినని 95 శాతం మంది చిన్న, సన్నకారు రైతులేనని గుర్తు చేశారు. మూడు రాజధానుల ప్రకటనతో రైతులు, రైతు కూలీలు మనోవేదనతో చనిపోతే ప్రభుత్వం నుంచి ఒక్కరు కూడా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ప్రాణాలకు విలువలేదా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

నేడు అద్దంకమ్మవారికి లక్షమల్లెల పూజ

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 27: వట్టిచెరుకూరు గ్రామ ప్రజల గ్రామదేవత అద్దంకమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం అమ్మవారికి లక్ష మల్లెలతో ప్రత్యేక పూజ, రాత్రికి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. త్వరలో ప్రారంభంకానున్న అద్దంకమ్మవారి తిరునాళ్ల ప్రారంభానికి అంకురార్పణగా ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేత

మంగళగిరి, ఏప్రిల్ 27: అప్పుడే పుట్టిన బిడ్డకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మంగళగిరి విజయ హెల్త్‌కేర్ ట్రస్టు తరపున ఆర్థిక సహకారం అందించారు. విజయవాడకు చెందిన నాగమణి అనే మహిళ పెళ్లయిన 20 సంవత్సరాల తరువాత మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు తక్కువ బరువుతో పుట్టడంతో నెల రోజులపాటు అత్యవసర వైద్యం అందించాలని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో నాగమణి దాతల సహకారం అర్థించింది. స్పందించిన విజయ హెల్త్‌కేర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు కాగితాల స్వాతి ట్రస్టు తరపున శిశువు వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం రూ.20 వేల ఆర్థికసాయం అందించారు.

వైసీపీ శ్రేణులకు అడుగడుగునా ఛీత్కారాలు

● ఓట్లు వేయబోమని తేల్చిచెబుతున్న మహిళలు
● జగన్ ఏం చేశాడో చెప్పి ఓట్లడగాలని హితవు
● రత్నాలచెరువులో వైసీపీ అభ్యర్థికి పరాభవం

మంగళగిరి, ఏప్రిల్ 27: మంగళగిరిలో ఓట్లడిగేందుకు ఇంటింటికీ వెళుతున్న వైసీపీ శ్రేణులకు అడుగడుగునా ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదురవుతున్నాయి. వైసీపీకి ఓట్లు వేయబోమని మహిళలు తేల్చిచెబుతుండడంతో ఆ పార్టీ శ్రేణులు బిక్కమొహం వేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ఇటీవల మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో పర్యటించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ఓ మహిళను కోరగా.. నారా లోకేశ్ ద్వారానే తమకు మంచి జరిగిందని, రాబోయే ఎన్నికల్లో ఆయనకే ఓటు వేస్తామని సదరు మహిళ తేల్చి చెప్పింది. దీంతో అవాక్కయిన లావణ్య, వైసీపీ శ్రేణులు అక్కడి నుంచి జారుకున్నారు. తాజాగా, రత్నాలచెరువు ప్రాంతంలో పర్యటించిన లావణ్య, వైసీపీ శ్రేణులకు మరోమారు చేదు అనుభవం ఎదురైంది. ఇంటింటి ప్రచారంలో భాగంగా వైసీపీకి ఓటు వేయాలని భాగ్యలక్ష్మి అనే మహిళను కోరగా.. మాకు జగన్ ఏం చేశాడో చెప్పి ఓట్లు అడగాలని ఆమె హితవు పలికారు. ఆఖరికి తమకు ఉన్న రేషన్ కార్డును కూడా రద్దు చేశారని, జగన్‌కు ఓటు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరైతే అభివృద్ధి చేస్తారో వారికే ఓటు వేస్తామని కుండబద్దలు కొట్టి చెప్పడంతో వైసీపీ శ్రేణులు నెమ్మదిగా అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. దీనికి సంబంధించిన వీడియో శనివారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది.

పేదల అభ్యున్నతికే సూపర్ సిక్స్ పథకాలు

● తుళ్లూరులో జోరుగా ఎన్‌డీఏ కూటమి నేతల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు

తుళ్లూరు, ఏప్రిల్ 27: పేదల అభ్యున్నతికి తీసుకొచ్చినవే సూపర్ సిక్స్ పథకాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎన్‌డీఏ కూటమి నేతలు తుళ్లూరులో ఇంటింటికి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ప్రచారంలో అధిక సంఖ్యలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. చంద్రబాబు మ్యానిఫెస్టోలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. అమరావతి ద్రోహులకు ఓటు వేయబోమని టీడీపీ నేతలకు ప్రజలు స్పష్టం చేశారు. రోజువారి ఉపాధి లేకుండా చేసిన జగన్‌కు ఎలా ఓటు వేస్తామని అంటున్నారు. నాసిరకం మద్యం అధిక ధరలకు అమ్మి ఇంటి యజమాని మంచాన పడేటట్టు చేసిన వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామని ప్రచారానికి వెళ్లిన టీడీపీ నేతలతో తమ ఆవేదన పంచుకున్నారు. మండలంలో అన్ని గ్రామల్లో ఇంటింటికి తిరిగి రాజధాని అమరావతిని నాశనం చేసి తమ జీవితాల మీద దెబ్బకొట్టిన వైసీపీని ఇంటికి సాగనంపుదామని ప్రచారం చేస్తామని దామినేని ఈ సందర్భంగా తెలిపారు. జగన్‌రెడ్డి కొత్తగా పెట్టిన మ్యానిఫెస్టోలో ప్రత్యేకత ఏమీ లేదన్నారు. సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేసే ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడని అన్నారు. ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు తెనాలి శ్రావణ్‌కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ తుళ్లూరు గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, నాయకులు ఉప్పలపాటి సాంబశివరావు (బెంగళూరు), బండ్ల పట్టయ్య, జమ్ముల అనీల్‌కుమార్, పువ్వాడ గణేష్, గద్దె బాబురావు, జమ్ముల ప్రదీప్, కొల్లి నరేంద్ర ఆలూరి చంద్రశేఖర్, గొరజాల నమోనారాయణ, కొండపనేని సాంబశివరావు, కొమ్మినేని రఘు, ఆలూరి తిరుపతిరావు, కొమ్మినేని నరేంద్ర(నాని), జొన్నలగడ్డ కిరణ్‌కుమార్, జనసేన నాయకులు సురేంద్రబాబు, చింకాల నరసింహారావు, బీజేపీ నాయకులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిర్రావూరులో టీడీపీ కూటమి నేతల ప్రచారం


చిర్రావూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ జనసేన, బీజేపీ నేతలు

తాడేపల్లి, ఏప్రిల్ 27: ఎంటీఎంసీ పరిధిలో చిర్రావూరులో శనివారం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఎమ్మెల్యేగా నారా లోకేశ్‌ను, ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలు, నారా లోకేశ్ ప్రకటించే నియోజకవర్గ మానిఫెస్టో ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి తోడ్పడాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావు, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



తాతిరెడ్డిపాలెంలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న నియోజకవర్గ పరిశీలకులు డీఐజీ అనిరుథ్ పంకజ్

తాడికొండ, ఏప్రిల్ 27: తాడికొండ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు డీఐజీ అనిరుథ్ పంకజ్ శనివారం పరిశీలించారు. లాం శివారులోని తాతిరెడ్డిపాలెంలోని పోలింగ్ బూత్‌లను, తాడికొండ అడ్డరోడ్డులోని చెక్ పోస్టులోని రికార్డులను, పోస్టల్‌బ్యాలెట్ కేంద్రమైన అంబేద్కర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎన్నికల పరిశీలకు అనిరుథ్ పంకజ్ తెలిపారు. రాజకీయపార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఎన్నికల అధికారులకు పిర్యాదు చేయాలని, వారిపై చర్యలు తీసుకుంటామని, తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఏమైన సమస్యలు తలెత్తితే నేరుగా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల పరిశీలకుల వెంటన తాడికొండ సీఐ ప్రభాకర్, ఎస్.ఐ అంజయ్య తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి : డీఎస్పీ


పెదనందిపాడులో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ బాషా

పెదనందిపాడు, ఏప్రిల్ 27: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, కళాశాలలోని పోలింగ్ బూత్‌లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సమస్యాత్మక బూత్‌లను గుర్తించామని, వాటి వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు కోసం సీసీ కెమెరాలు, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఆయా రాజకీయ పార్టీల నేతలు సహకరించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా పంపిణీలు చేస్తున్నట్లైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంతర్ జిల్లాల సరిహద్దు పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ నిస్సార్‌బాషా, ఎస్ఐ రాజ్‌కుమార్‌లు ఉన్నారు.



ఓటు అవగాహన టూకే రన్‌ను నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు

ఓటు హక్కును వినియోగించుకోండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 27: రానున్న సార్వత్రిక ఎన్నికలలో పట్టణంలోని ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పిలుపునిచ్చారు. స్థానిక రజకపేటలోని రజక ఐలమ్మ పార్కు వద్ద శనివారం రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ టూకే రన్‌ను మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న నిర్వహించారు. ఈ టూకే రన్‌ను రజక ఐలమ్మ పార్కు నుంచి చినరావూరు పార్కువరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ప్రజలతో పాటు సీనియర్ సిటిజన్స్, ముఖ్యంగా యువత తమ ఓటు ద్వారా రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి కృషిచేసే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ప్రజలు మే 13న జరిగే ఎన్నికలలో స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఎటువంటి ప్రభోవాలకు లోనుకాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, మున్సిపల్ కార్మికులు, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వాకర్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు ఆదినారాయణకు డాక్టరేట్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 27: తెనాలికి చెందిన కళాకారుడు ఆరాధ్యుల ఆదినారాయణకు బెస్ట్ యాక్టర్ విభాగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం ఊటీలో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడు దశాబ్దాలుగా పౌరాణిక నాటకాలలో పలు పాత్రలు పోషించి నంది అవార్డు కూడా సాధించిన ఆయన తెనాలిలో దుర్గాభవాని నాట్యమండలి స్థాపించారు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ ఈ పురస్కారం ప్రదానం చేసింది. రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణశెట్టి, సుబ్బారావు, కళా ప్రముఖులు జయలక్ష్మి, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, నాగరాజు, రాజు, వెంకట్, మల్లేశ్వరరావులు ఆయనను అభినందించారు.



సత్కారం అందుకుంటున్న ఆదినారాయణ

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 27: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. మోదుగ శ్యామలదేవి, ఎంఆర్‌కే మూర్తిల జ్ఞాపకార్థం మత్తె రమాదేవి, జి.ఆంజనేయశాస్త్రి, లక్ష్మీసౌజన్య దంపతుల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, సందీప్, అబ్దుల్ రజాక్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, ప్రతాప్, శ్రీరామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి

● ఎన్నికల ప్రచారంలో రాజ్యలక్ష్మి, మనోహరం

తెనాలి రూరల్, ఏప్రిల్ 27: రాబోయే ఎన్నికల్లో ప్రజలందరికీ మంచిచేసే ఉమ్మడి పార్టీల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లను ఓటు వేసి ఆశీర్వదించాలని చంద్రశేఖర్ సోదరి రాజ్యలక్ష్మి, మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని 3, 18వ వార్డులో ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను గాజు గ్లాసు గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపించగలిగే సత్తా ఉన్న నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నరేంద్ర మోడీలన్నారు. ఉమ్మడి పార్టీ అధికారం చేపట్టిన వెంటనే రాజధాని అమరావతి, రోడ్ల నిర్మాణం, ప్రజలకు మౌలిక వసతులు, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం బాటలో పరుగులు పెట్టించనున్నారని ప్రజలందరూ ఉమ్మడి పార్టీ శ్రేణులను ఆదరించి ఆశీర్వదించాలని వార్డు ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్న రాజ్యలక్ష్మి, మనోహరం తదితరులు

నేడు నారా లోకేశ్ పర్యటన వివరాలు

మంగళగిరి, ఏప్రిల్ 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు మంగళగిరి మండలం నీరుకొండ గ్రామప్రజలతో సమావేశమవుతారు. సాయంత్రం 4:30 గంటలకు దుగ్గిరాల మండలం గొడవర్రు, 6 గంటలకు తాడేపల్లి పట్టణం 15, 16 వార్డులు, 7:30 గంటలకు తాడేపల్లి మండలం పెనుమాక గ్రామాల్లో జరిగే రచ్చబండలో లోకేశ్ పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

నిరుపయోగంగా పేదల గృహాలు

- వృథాఅవుతున్న ప్రజాధనం
- ఐదేళ్లుగా ఇళ్లకోసం పేదల ఎదురుచూపులు
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



వైసీపీ పాలనలో ఐదేళ్లుగా నిరుపయోగంగా వదిలివేసిన పేదల టిడ్కో ఇళ్లు



తెనాలి అర్బన్, ఏప్రిల్ 27: ఇల్లు కాదు.. ఊళ్లు కడుతున్నాం.. మాది పేదల ప్రభుత్వమని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలు అలాగే వదిలేశారు. ప్రజాధనాన్ని ఇలా గాలికి వదిలేస్తే సమాధానం ఎవరు చెబుతారంటూ పలువురు పేదలు నిలదీస్తున్నారు. పట్టణంలోని పూలే కాలనీలో పేదల కోసం 1200 గృహాల నిర్మాణాన్ని తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టింది. కొన్ని బ్లాకులు పూర్తి చేయగా మరికొన్ని బ్లాకుల నిర్మాణం సగంలోనూ, మరి కొన్ని బేస్‌మెంట్ దశల్లో ఉన్నాయి. స్థలంతో పాటు దృఢమైన ఇంటిని కూడా నిర్మించి పేదలకు ఇవ్వాలని తలపెట్టిన తెలుగుదేశం ప్రభుత్వానికి పేరు వస్తుందనే ఆలోచనతో ఈ గృహాలను పూర్తి చేయకుండా వదిలేశారు. గృహ నిర్మాణం మూడు పొట్లుగా నిర్మించి భూకంపాలు వచ్చినా కూడా తట్టుకునేలా గోడలను కూడా కాంక్రీటుతో ఏర్పాటుచేశారు. ఇంత పటిష్టమైన భవనాలను పేదలకు అప్పగించేందుకు మనసురాక రూ.కోట్ల విలువైన ప్రజాధనాన్ని నిరుపయోగం చేసింది. గృహాల చుట్టూ అప్పటి ప్రభుత్వం ప్రహరీ నిర్మింపజేసింది. కనీసం పూర్తిఅయిన ఇళ్లను కూడా పేదలకు ఇవ్వకుండా వైసీపీ నేతలు రాజకీయం చేశారని విమర్శిస్తున్నారు. ఈ నిర్మాణాలు ఐదేళ్లుగా అలానే ఉండటంతో చెట్లు, ముళ్లపొదలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. దీంతో పూలే కాలనీ వాసులు ఇబ్బందులుపడుతున్నారు. నిర్మాణం చేపట్టిన గుత్తేదారుల వస్తువులన్నీ కూడా తుప్పుపట్టిపోతున్నాయి. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్ప ఈ గృహాలకు మోక్షం లేదని పలువురు పేదలు భావిస్తున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న టిడ్కో గృహాల పరిసరాలు

పంపిణీ చేసిన చోట కనీస సౌకర్యాలు కరవు

తెనాలి రూరల్, ఏప్రిల్ 27: టీడీపీ మాయమాటలు చెబుతోంది.. టిడ్కో ఇల్లు నిర్మించింది పంపిణీ చేస్తుంది మేమే.. జగనన్న వచ్చిన తరువాతే పేదల బతుకుల్లో వెలుగులు నిండాయి.. గృహసముదాయాలనుంచి హైవేకు నేరుగా చేరుకునేలా కాలువపై బ్రిడ్జినిర్మిస్తామని టిడ్కో ఇళ్ల పంపిణీలో లబ్ధిదారులకు మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే శివకుమార్ లు హామీ ఇచ్చారు. ఇది నీటిమూటలా రెండేళ్ల గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు. ఓవైపు నిర్మించిన గృహాలు పంపిణీ చేయక ప్రజాధనం వృథాఅవుతుంటే, మరోవైపు జగ్గడిగుంటపాలెంలో నిర్మించిన టిడ్కో గృహాలు కనీస సౌకర్యాలకు నోచలేదు. ఆనాడు పట్టాల పంపిణీ సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యేలు పలుమార్లు టిడ్కో లబ్ధిదారులకు సౌకర్యాలు కల్పిస్తామన్నా ఇంతవరకూ వాటిపై దృష్టిపెట్టలేదు. వీటిలో కరెంట్ కనెక్షన్ నుంచి తాగునీరు, మురుగు, వ్యర్థాలు తరలింపునకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డు మార్గం నుంచి టిడ్కో గృహాలకు చేరేందుకు మట్టి, కంకరలేచిన రాళ్లలో నడుచుకుంటూ దాదాపుగా అర కిలోమీటరు వెళ్లాల్సి ఉంది. మార్గమధ్యలోనే ప్రభుత్వ మద్యం షాపుకూడా ఉండటం విశేషం. పైగా రాత్రుళ్లు మద్యం దుకాణం మీదుగా మహిళలు గృహాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి, ఎమ్మెల్యే హామీ ప్రకారం బ్రిడ్జి నిర్మించి ఉంటే ప్రధాన రహదారికి సులభంగా చేరుకోవచ్చు ఈ ప్రభుత్వం సభల్లో ఊదరగొట్టే ప్రసంగాలు తప్ప క్షేత్రస్థాయిలో చేసేదేమీ లేదని టిడ్కో సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యేల హామీలే సాక్ష్యమంటూ పలువురు విమర్శలు చేస్తున్నారు.

రాజ్యాంగేతర శక్తిగా అధికారం చెలాయించిన మురళీకృష్ణ

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



అంబటి మురళి అరాచకాలపై ముద్రించిన కరపత్రాలు ప్రదర్శిస్తున్న నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 27: సత్తెనపల్లిలో అంబటి మురళీకృష్ణ రాజ్యాంగేతర శక్తిగా మారి అధికారాన్ని చెలాయించటంతోపాటు అరాచకాలు, దౌర్జన్యాలు సాగించారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. శనివారం డీవీసీ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సత్తెనపల్లిలో అంబటి మురళీకృష్ణ చేసిన అధికార దుర్వినియోగం తదితర అంశాల గురించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ అన్న అంబటి రాంబాబు మంత్రి అయిన తర్వాత అంబటి మురళీకృష్ణ షాడో ఎమ్మెల్యేగా సత్తెనపల్లిలో వ్యవహరించారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో రాంబాబు తరపున అంబటి మురళి నామినేషన్ దాఖలు చేశారన్నారు. రాంబాబు తరపున సత్తెనపల్లి కేంద్రంగా రాజకీయాలు నడిపించిందని అంబటి మురళీయేనన్నారు. కానీ పొన్నూరు వచ్చి తాను రాజకీయాలకు కొత్త అని అమాయకుడినని నటన ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. అస్కార్‌కు మించిన అవార్డులు ఉంటే అంబటి మురళీకృష్ణకు ఇవ్వవచ్చు అన్నారు. ఎమ్మెల్యేగా చేయాల్సిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు స్వయంగా అంబటి మురళి సత్తెనపల్లిలో చేశారన్నారు. రేషన్ షాపుల ప్రారంభోత్సవాలు చేశారని ఫోటోలు ప్రదర్శించారు. అలాగే అధికారాన్ని ఉపయోగించి కొండను మాయంచేసిన ఘటనను ప్రజల ముందు ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటమి భయంతో వైసీపీ కుయుక్తులు : ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 27: ఓటమి భయంతో వైసీపీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. ఇటీవల వైసీపీలోకి వెళ్లిన పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన హరిరామకృష్ణ శనివారం తాజాగా నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీ, జనసేనలో చేరారు. నరేంద్ర కుమార్ రామకృష్ణకు పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఓటమి భయంతో టీడీపీ, జనసేన నాయకులను వైసీపీ నాయకులు మాయమాటలు చెప్పి బలవంతపెట్టి పార్టీలోకి తీసుకెళుతున్నారన్నారు. ఇష్టం లేకపోయినా బలవంతంగా పార్టీలు మార్పించటం సరికాదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యన్నం నాయుడు, యలవర్తి వెంకటేశ్వరరావు, సూద వసంత్, గరికపాటి చిన్నారి, పి.సుబ్బారావు, మాదాసు అప్పారావు, జల్లిపల్లి దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిని గెలిపించాలి: ధూళిపాళ్ళ

చేబ్రోలు, ఏప్రిల్ 27: ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం చేబ్రోలులోని పలు ప్రాంతాలలో టీడీపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల మహిళలు నరేంద్ర కుమార్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. చేబ్రోలులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య గురించి వివరించారు. అలాగే మురుగు కాల్వలు లేక పడుతున్న ఇబ్బందులు, పెన్షన్ల తొలగింపు సమస్యలను నరేంద్ర దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో చేబ్రోలు ప్రజలకు మౌలిక వసతుల కల్పన కూడా చేయలేకపోయారని విమర్శించారు. ఆంక్షల పేరుతో ప్రజలకు సంక్షేమ పథకాలను దూరం చేశారని ఆరోపించారు. అభివృద్ధి కానరావటం లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు అవసరమైన రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం చెప్పడతామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికలకు వెళుతుందని సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనని, ఎంపీగా పెమ్మసానిని గెలిపించాలని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హరిరామకృష్ణకు పార్టీ కండువాలు కప్పుతున్న నరేంద్రకుమార్

అభివృద్ధికోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 27: తెనాలి ప్రాంతాన్ని విద్య, వైద్యం, వర్తక, వాణిజ్య వ్యాపార రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుకునేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన పీఏసీ ఛైర్మన్, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగు జనచైతన్య పాదయాత్రలో భాగంగా కూటమి పార్టీ శ్రేణులతో కలిసి మనోహర్ పట్టణంలోని 33, 34వ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో పర్యటిస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించి ప్రాంత అభివృద్ధికి తనతో కలిసి నడవాలని కోరారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న మనోహర్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని వార్డు ప్రజలకు మనోహర్ విజ్ఞప్తి చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే తెనాలి ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా తెనాలి - మంగళగిరి నాలుగు లైన్ల రోడ్డుమార్గం వేయడంతోపాటు కుళాయిల ద్వారా తాగునీరు, డ్రెయిన్లు, రోడ్లు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు మంచి జరిగేలా చూస్తానని మనోహర్ హామీ ఇచ్చారు. తొలుత వార్డు పర్యటనకు వచ్చిన మనోహర్‌ను ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు గజమాలలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. పలువురు మనోహర్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పెద్ద సంఖ్యలో ఉమ్మడి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.



గాజుగ్లాసు, సైకిల్ గుర్తులు చూపుతూ వృద్ధురాలికి అవగాహన కల్పిస్తున్న నాదెండ్ల మనోహర్

ఓట్ల కోసమే జగన్ మేనిఫెస్టో: మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 27: గత ఐదేళ్ల క్రితం మేనిఫెస్టో విడుదలచేసిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని సక్రమంగా అమలు చేయకపోగా విద్యుత్, నీరు, మునిసిపల్ ట్యాక్స్ పన్నుల భారం ప్రజలపై మోపి సంక్షోభపాలనకు తెరలేపారని నాదెండ్ల మనోహర్ విమర్శించారు. శనివారం తెనాలిలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఓట్లు వేయించుకునేందుకే రెండు పేజీల మేనిఫెస్టోను జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశాడని ఆరోపించారు. గతంలో చెప్పిన మేనిఫెస్టో హామీలను నెరవేర్చకపోగా వివిధ రకాల ట్యాక్సుల పేరుతో ప్రజలనుంచి ముక్కుపిండి వసూలు చేసిన విధానం ప్రజలు గమనించారన్నారు. ఐదేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మేనిఫెస్టో అమలుచేసి ప్రజలను ఎక్కడా కూడా సంక్షేమం వైపు నడిపించిందే లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికారం కోసం మేనిఫెస్టో డ్రామాకు జగన్ తెరలేపారని ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఎక్కడా కూడా అభివృద్ధి చెందింది లేదని ఉద్యోగులకు సకాలంలో జీతాలు లేక నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక, రైతులు పంటల సాగుకు నీరు అందక, భవన నిర్మాణ రంగ కార్మికులు ఇసుక కొరత వంటి వాటితో రాష్ట్రం అట్టుడికిందని మనోహర్ జగన్ పాలనను ఎండగట్టారు. తిరిగి ప్రజలను సంక్షేమం, అభివృద్ధి పేరుతో మోసం చేయలేరని రాష్ట్ర ప్రజలు తెలివైన వారని చెప్పారు. ఉమ్మడి అభ్యర్థులు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, నరేంద్రమోడీ నాయకత్వానికే పట్టంగట్టి గతంలో చేసిన పొరపాటును సరిదిద్దుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుంటూ సంక్షేమ పాలనకు పట్టం కట్టనున్నారని మనోహర్ స్పష్టంచేశారు. జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా ఓట్ల కోసమేనని స్పష్టం చేశారు.

దేశ తలరాతను మార్చే సత్తా ఓటుకే ఉంది: విద్యావేత్త చంద్రయ్య

గుంటూరు, ఏప్రిల్ 27: ప్రజల భవిష్యత్తును, దేశం తలరాతను మార్చే సత్తా ఒక్క ఓటుకే ఉందని విద్యావేత్త వై.చంద్రయ్య అన్నారు. గుంటూరు నగరం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన ఓటర్ల చైతన్య సభలో ఆయన ప్రసంగించారు. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడానికి, తద్వారా మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలకు దక్కిన ఆయుధమే ఓటన్నారు. ప్రభుత్వ స్వరూపం, స్వభావం ప్రజలు విచక్షణతో వినియోగించిన ఓటుపై ఆధారపడి ఉంటాయని, ప్రభుత్వం మంచిదైనా, చెడ్డదైనా దాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రజలే బాధ్యత వహించవలసి వస్తుందన్నారు. మంచి నాయకత్వం లేకుండా మంచి ప్రభుత్వం, సమాజం సాకారం కావని మంచి నాయకులు సమాజానికి సేవ చేస్తే, దుష్ట నేతలు సంఘాన్ని దోచుకుంటారని, సమాజమే తమకు సేవ చేసే విధంగా మలుచుకుంటారన్నారు. విచక్షణగా ఆలోచన చేసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్‌వి సింగర య్య, వివిఎస్ఎన్ మల్లేశ్వరరావు, ఇంజనీర్ సదాశివం ప్రసంగించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

పెదకాకాని, ఏప్రిల్ 27: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన పొన్నూరు నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌లను ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్ శనివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల కు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెద కాకాని తహసీల్దార్ రత్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్



వెంకటాద్రినాయుడు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అర్చకులు, సిబ్బంది

ఘనంగా వెంకటాద్రినాయుడు జయంతి ఉత్సవాలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 27: రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. వెంటాద్రినాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మండేపూడి పానకాలరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా సంకటహర చతుర్థి వ్రతాలు

పెదకాకాని, ఏప్రిల్ 27: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి వారి దివ్యక్షేత్రంలో ఉన్న మహాగణపతిస్వామి వారికి శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా వైభవంగా సంకటహర చతుర్థి వ్రతాలు జరిపించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య మహాగణపతిస్వామి వ్రతంను భక్తులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై, కుటుంబ సమేతంగా తరలి వచ్చి దంపతులు ఈ వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు దంపతులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రూప్-2 విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

పెదకాకాని, ఏప్రిల్ 27: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శనివారం గ్రూప్2 ప్రిలిమ్స్ క్వాలిఫై అయిన 50మంది విద్యార్థులకు తులసి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎండీ తులసి యోగేష్‌చంద్ర ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసి యోగీష్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, ఉద్యోగాలు సాధించాక పేద, మధ్యతరగతి విద్యార్థులకు అండగా ఉండి సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత బైరిశెట్టి మల్లికార్జునరావు, వసుంధర, దావులూరి హర్షిత, మణికంఠ, మోహన్‌ప్రసాద్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న తులసీ యోగేష్ చంద్ర

వడదెబ్బ బాధితుల కోసం ఐసీయూ వార్డు

గుంటూరు (మెడికల్) ఏప్రిల్ 27 : ఈ వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ బాధితుల చికిత్స కోసం ఆరు పడకలతో కూడిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) వార్డును ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి తెచ్చినట్లు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రత్యేక ఐసీయూ వార్డును శనివారం ఆయన ప్రారంభించారు. జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శైలజ పర్యవేక్షణలో వడ దెబ్బ బాధితులకు ప్రత్యేక చికిత్సలు అందిస్తారన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటం వల్ల ప్రజలు వడ దెబ్బ బారిన పడే అవకాశం ఉందని ఆయన వివరించారు. బాధితుల్లో తలనొప్పి, తల తిరగడం, నీరసం, వికారం, శ్వాస పీల్చడం కష్టంగా మారడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వీరికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు.



ఐసీయూను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి, ఉండవల్లి, కాజ టోల్ ప్లాజ్ వద్ద వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా దాదాపు 145 మోటారు కార్లు, 27 కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు, 23 రవాణా వాహనాలను తనిఖీచేశారు. అనంతరం కరీం మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సరుకులను రవాణా చేస్తే డ్రైవర్లపై కేసు నమోదుచేసి, సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. తనిఖీలలో ఆర్టీవోలు గోపాల్, ప్రసాదు, మోటారు వాహన తనిఖీ అధికారులు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లేశ్వరి, సంధ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్ 2024

నాదెండ్ల, ఏప్రిల్ 27: పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. గణపవరంలోని సీఆర్ కళాశాలతో పాటు చిలకలూరిపేట పట్టణంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. ఆరు కేంద్రాల్లో మొత్తం 2049మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1732మంది హాజరయ్యారు. 317మంది గైర్హాజరయ్యారు. ఉదయం 10గంటలకే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.డేవిడ్‌రాజు, అబ్జర్వర్ కే మహమ్మద్, పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ బీ రమాదేవి, అబ్జర్వర్ ప్రభాకరరావులు పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పర్యవేక్షించారు.